ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కడప జిల్లా వార్తలు


5

గురువారం 7 నవంబరు 2024



కడప కార్పొరేషన్ సమావేశం హాలులో డయాస్‌పై ఒకే ఒక్క కుర్చీకి ఏర్పాట్లు చేసిన దృశ్యం

కార్పొరేషన్‌లో కుర్చీలాట



- నిన్నటి సమావేశం దాకా.. మేయరు పక్కనే ఎమ్మెల్యేల కుర్చీలు
- ఈసారి మేయరుకు మాత్రమే
- కార్పొరేటర్లతో పాటే ఎమ్మెల్యేలకు సీట్లు
- నిన్నటి దాకా ఓ రూల్.. ఇప్పుడు ఒక రూలా అంటూ టీడీపీ ఆగ్రహం
- నిబంధనల మేరకే నిర్ణయాలు అంటున్న వైసీపీ
- కాక రేపుతున్న నేటి జనరల్ బాడీ సమావేశం

మహిళనని చిన్నచూపు..

మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశానికి తొలిసారి వెళ్లినపుడు నాపై కార్పొరేటర్లు ఆప్యాయత చూపించారు. వారి ఆదరాభిమానాలు ఎప్పటికీ మరచిపోను. వారితో కలిసి కడప నగరాన్ని అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యం. ఎన్నో ఏళ్లగా మేయరు పక్కన ఎమ్మెల్యే సీటు వేస్తున్నా అది పక్కన బెట్టి ఇప్పుడు సీటు మార్చారు. అంటే నేను మహిళనని ప్రథమ పౌరుడు మరిచాడు. నేను వచ్చిన తొలి మీటింగ్‌కు ఆయన రాలేదు. కడప ప్రజలు నాపై ఎన్నో ఆశలు పెట్టుకుని గెలిపించారు. కడప అభివృద్ధిలో టీడీపీ మార్కు ఏంటో చూపిస్తాం. మేయరు పక్కనున్న సీటు తొలగించడం ప్రథమ పౌరుడి (మేయరు నుద్దేశించి) విజ్ఞతకే వదిలేస్తున్నాం. కార్పొరేషన్‌లో జరిగిన అవినీతిని వదిలే ప్రసక్తే లేదు. విచారణ చేసి జనం సొమ్ములాక్కున్న రాబందులను బయటికి లాగుతాం.

- ఆర్.మాధవి, కడప ఎమ్మెల్యే

(కడప-ఆంధ్రజ్యోతి): కడప.. ఇప్పుడు రాష్ట్రంలోనే హాట్‌టాపిక్. మొన్నటి దాకా మాజీ సీఎం జగన్ ఆయన చెల్లెలు షర్మిల ఆస్తుల గొడవతో పేరు మార్మోగింది. ఇక నిన్న వైసీపీ సోషల్ మీడియా సైకో వర్ర రవీంద్రరెడ్డి అరెస్టు, జంపింగ్ వ్యవహారం కలకలం రేపింది. ఆ సంఘటనలు మరువకముందే ఇప్పుడు కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం సందర్భంగా పాలకవర్గ వైసీపీ, అధికార పార్టీ టీడీపీ మధ్య చోటు చేసుకుంటున్న సంఘటనలు కలకలం రేపుతున్నాయి. కార్పొరేషన్‌లో జరుగుతున్న కుర్చీలాట ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీలో స్పీకర్‌కు అధికారాలు ఎలా ఉంటాయో వాటినే అమలు చేస్తామని వైసీపీ పాలకులు చెబుతుండగా.. నిన్నటి దాకా అమలు చేసిన విధానాన్ని ఇప్పుడు అర్ధాంతరంగా మార్చివేయడం ఎందుకు, టీడీపీ శాసనసభ్యులను అవమానపరిచేందుకేనా అంటూ వీరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరు పార్టీల మధ్య గురువారం సమావేశంపై ఉత్కంఠ నెలకొంది. పోలీసులు కూడా వచ్చి కార్పొరేషన్ సమావేశ హాలును, ఇతర వాటిని పరిశీలించి వెళ్లడంతో నేటి సర్వసభ్య సమావేశం ఇండియా, పాకిస్తాన్ వన్‌డే మ్యాచ్‌ను తలపించే విధంగా హైఓల్టేజీలా మారనుంది.

కుర్చీలాట

కడప కార్పొరేషన్ అవతరణ నుంచి అప్పటి రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ తరువాత జగన్ పార్టీకి చెందిన వైసీపీ పాలకవర్గాలే కొనసాగుతున్నాయి. 2014-19 టీడీపీ హయాంలోనూ, 2019-24లో వైసీపీ హయాంలోనే వైసీపీ పాలకవర్గం ఉండేది. మేయరుగా మాజీ సీఎం జగన్ మేనమామ రవీంద్రనాథరెడ్డి ఉండగా రెండో పర్యాయం ప్రస్తుత మేయరు సురేశ్‌బాబు పనిచేస్తున్నారు. కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉండగా 40 డివిజన్లు కడప అసెంబ్లీ పరిధిలోకి వస్తే మూడు డివిజన్లు కమలాపురం నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. అందుకే కార్పొరేషన్ సమావేశానికి కడప, కమలాపురం ఎమ్మెల్యేలు హాజరవుతుంటారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఇటీవల నిర్వహించిన తొలి మీటింగ్‌లో కడప, కమలాపురం ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మేయరు పక్కనే ఇటు అటు ఎమ్మెల్యేలు కూర్చున్నారు. వైసీపీ హయాంలో కూడా ఓ పక్క అప్పటి డిప్యూటీ సీఎం, మరోపక్క అప్పటి కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి కూర్చునేవారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక కూడా జరిగిన తొలి మీటింగ్‌లో ప్రస్తుత మేయరు సురేశ్‌బాబు హాజరుకాలేదు. అప్పట్లో డిప్యూటీ మేయర్‌కు ఒక వైపు కడప ఎమ్మెల్యే మాధవి, మరోపక్క కమలాపురం ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి కూర్చున్నారు.

సీట్ల కోసం పోటీ

ప్రస్తుతం కడపలో టీడీపీ, వైసీపీలో కొందరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయి ఉండగా మరికొందరు డ్రామాలాడుతున్నారంటారు. గురువారం జరిగే కార్పొరేషన్ సమావేశాన్ని ఇరుపార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. కార్పొరేషన్‌లో టీడీపీకి అలంఖాన్‌పల్లెకు చెందిన లక్ష్మిరెడ్డి కోడలు ఉమాదేవి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇటీవలే వైసీపీ నుంచి సూర్యనారాయణ జాయిన్ అయ్యారు. మిగిలిన వారంతా వైసీపీ వారే. నిన్నటిదాకా మేయరు పక్కనే ఎమ్మెల్యేలు కూర్చునేవారు. అయితే నేటి సమావేశానికి వేదికపైన కేవలం మేయరు సీటు మాత్రమే వేశారు. ఎమ్మెల్యేలకు కూడా కార్పొరేటర్ల పక్కనే సీట్లు వేశారు. దాదాపు ఎనిమిదేళ్లగా మేయరు సీటు పక్కనే ఎమ్మెల్యేలు కూర్చునేవారు. అయితే తొలిసారిగా ఇప్పుడు సీటు మారింది. అసెంబ్లీకి స్పీకరు ఎలాగో కౌన్సిల్‌కు మేయరుదే అధికారం. అందుకే ఈసారి రూల్స్‌ను పాటిస్తున్నామని వైసీపీ నేతలు చెబుతున్నారు. ఇప్పటికి కూడా హైదరాబాదు మున్సిపల్ కమిషన్ చట్టమే మనకు అమలులో ఉంది. అక్కడి చట్టాలే ఇప్పటికీ అమలవుతున్నాయి. నిన్నటిదాకా మేయరు సీటు పక్కనే ఎమ్మెల్యేకు సీటు వేసి ఈసారి తీసివేయడాన్ని టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేకున్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు మావాళ్లు, ప్రభుత్వం మాది అధికారంలో ఉంది, కడప అభివృద్ధికి ఏమన్నా కావాలంటే కౌన్సిల్‌లో చర్చిస్తే మా వాళ్లు కొట్లాడి నిధులు తీసుకువస్తారు. అయితే కేవలం వైసీపీ పాలకవర్గం కావడంతోనే వాంటెడ్‌గా ఎమ్మెల్యేల సీటు తొలగించారంటూ టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మేయరుకు ఉన్న అధికారం మేరకే నిర్ణయాలు తీసుకోవచ్చంటూ వైసీపీ శ్రేణులు అంటున్నాయి. కార్పొరేషన్ మీటింగ్ ఇరుపార్టీల మధ్య ప్రతిష్టాత్మకంగా మారింది. సీట్ల కోసం కుర్చీలాట జరుగుతోంది. అనుకోని సంఘటనలు జరిగే అవకాశం ఉన్నట్లు ప్రచారంలో ఉంది. ఈ నేపధ్యంలో వైసీపీ నేతలు ఎస్పీని కలిసి సర్వసభ్య సమావేశానికి కేవలం కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులను అనుమతించాలని.. మిగతా వారికి ప్రవేశం లేదని చెప్పారు. దీంతో ఒక్కసారిగా సర్వసభ్య సమావేశం హీట్ ఎక్కింది. ప్రతిసారి సమావేశంలో కార్పొరేటర్లకు విలువ ఉండేది కాదు. అయితే ఈసారి కార్పొరేటర్లకు ప్రాధాన్యం ఇచ్చారని చెబుతున్నారు.

కార్పొరేషన్ సమావేశానికి పటిష్ట బందోబస్తు

కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం గురువారం జరగనున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని వన్‌టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. కార్పొరేషన్ ఆవరణలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని, ఐడీ కార్డులు ఉన్న వ్యక్తులను, కార్పొరేషన్ అధికారులను, అనుమతించిన పత్రాలు ఉన్న వారినే లోపలికి పంపిస్తామని చెప్పారు. బయటి వ్యక్తులు ఎవరైనా లోపలికి రావాలని ప్రయత్నిస్తే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. నగరంలో పోలీసు 30 యాక్టు అమలులో ఉంది కాబట్టి నలుగురి కన్నా ఎక్కువ జనాలు గుమికూడినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నలుగురు సీఐలు, ఏడుగురు ఎస్ఐలతో పాటు 30 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు బందోబస్తు విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కౌన్సిల్‌కు మేయరే సుప్రీం..

అసెంబ్లీకి స్పీకరే సుప్రీం. అలాగే కార్పొరేషన్‌కు మేయర్‌దే తుది నిర్ణయం. నేను, కార్పొరేటర్లు మాట్లాడుకుని మేయరు పక్కనే ఎమ్మెల్యే సీట్లపై నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రంలో ఎక్కడా ఏ కార్పొరేషన్ కానీ మేయరు పక్కన ఎమ్మెల్యేలకు సీట్లు లేవు. నిన్నటి వరకు వైసీపీ ఎమ్మెల్యేలు కూర్చున్నారు. వాళ్లకు నాకు కుదిరింది. నా ఇష్ట ప్రకారం కూర్చున్నాం. కూర్చోవాలని రూల్ లేదు. ఈసారి నిబంధనలు అమలు చేస్తున్నాం. అసెంబ్లీలో స్పీకర్ ఎలాగో కార్పొరేషనుకు మేయరు అంతే. డయాస్‌పై నేనే ఉంటాను. టీడీపీ ఎమ్మెల్యేలని మేమెప్పుడూ చిన్నచూపు చూడలేదు. రాష్ట్రంలో అన్ని కార్పొరేషన్లలో ఉండే విధంగానే ఇక్కడ అదే విధానం అమలు చేస్తున్నాం.

- మేయరు సురేశ్‌బాబు

అపార్‌కు ఆమోదం కష్టాలు..!

- సేవల ఆమోదానికి నిరీక్షణ..!
- ఆధార్ సెంటర్లలో నమోదైనా..హోల్డ్‌లోనే
- వార్డు, గ్రామ సచివాలయాల్లోనూ ఇదే పరిస్థితి
- క్యూ కడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

6


ఆధార్ సెంటర్ వద్ద జనాల రద్దీ

పొంచి ఉన్న సైబర్ కేటుగాళ్లు

- ఆన్‌లైన్ సేవల వినియోగంలో తొందరపాటు వద్దు
- అప్రమత్తంగా లేకపోతే ఖాతాలో డబ్బు ఖాళీనే

7





కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం

- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయ సహకారంతో, ప్రజల అభిమానంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ చేరుకున్న ఆయన కలెక్టర్ చాంబరులో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ముఖ్య పాలనా అధికారిగా ఉద్యోగ బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో అక్షరాస్యతను పెంచడం, పేదరిక నిర్మూలన, ఉద్యోగ కల్పన అనే మూడు ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. కలెక్టర్‌గా కర్తవ్య నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తూ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందేలా కృషి చేస్తామన్నారు. కాగా.. కలెక్టర్‌గ బాధ్యతలు చేపట్టిన శ్రీధర్ చెరుకూరికి ముందుగా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఇన్‌చార్జి డీఆర్వో శ్రీనివాసులు, ఆర్డీఓలు జాన్‌ఇర్విన్ తదితరులు మొక్కలను అందించి స్వాగతం పలికారు. అనంతరం పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు, సిబ్బంది, పాత్రికేయులు, ప్రముఖులు తదితరులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందించి అభినందనలు తెలిపారు.

ఎస్పీతో సమీక్ష నిర్వహించిన డీఐజీ

కడప (క్రైం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవిత పర్యటన సందర్భంగా పలువురు నేతలు ఎస్పీపై ఫిర్యాదు చేయడం తెలిసిందే. దీంతో పాటు సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రిపై అసభ్య పోస్టింగ్‌లు, ఫోటో మార్ఫింగ్ వీడియోలపై చర్చించినట్లు తెలిసింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు అంశాలపై డీఐజీ ఎస్పీని అడిగి తెలుసుకోవడంతో పాటు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణపై ఆరా తీసినట్లు సమాచారం. డీఐజీ కర్నూలుకు తిరుగు ప్రయాణ సమయంలోనే ఎస్పీపై బదిలీ వేటు పడటం గమనార్హం.

మధ్యాహ్న భోజనం పెట్టండి

- విద్యాదీవెన బకాయిలు విడుదల చేయండి
- కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా

కడప ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాహుల్, రవి డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలను విడుదల చేయాలని కోరారు. బుధవారం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ కోటిరెడ్డిసర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు రూ.3,480 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. జీవో నెం.77ను రద్దు చేసి పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు కల్పించే విధంగా ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు. మంత్రి నారాలోకేశ్ యువగళం పాదయాత్రలో విద్యార్థుల సమస్యలను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పరిష్కరిస్తామని, జీవో 77ను రద్దు చేస్తామని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చిన విషయం గుర్తు చేశారు. తక్షణం మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి అజయ్, జిల్లా కమిటీ సభ్యులు అభినయ్, సురేశ్, జర్నియా, చక్రవర్తి, గిరి, జయంత్ యశ్వంత్ పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

జిల్లా అభివృద్ధికి సహకరించండి

- ప్రతి నియోజకవర్గంలో ఐటీ కారిడార్
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి



కడప ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి అందరూ సహకరించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గంలో ఐడీ కారిడార్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. దీంతో యువతకు ఉద్యోగ ఉపాధి లభించే అవకాశం ఉందని అన్నారు. బుధవారం కడప నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాటి వైసీపీ ప్రభుత్వం జిల్లాకు సంబంధించి అన్ని విషయాల్లో నట్టేట ముంచిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఒక్క ఐటీ సంస్థను కూడా తెచ్చింది లేదన్నారు. రాష్టంలో ఉన్న సంస్థలు బయటికి వెళ్లేలా చేసిందన్నారు. జిల్లా అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉన్నట్లయితే డీఆర్‌సీ సమావేశానికి ఎమ్మెల్యే, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఎంపీ అవినాశ్‌రెడ్డి వచ్చేవారన్నారు. జిల్లా నుంచి తరలివెళ్లిన ఎంఎస్ ఎంఈ సెంట రుతో పాటు నీటిపారుదల రంగాన్ని గాడిలో పెట్టేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఇప్పటికే పెన్షన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాలు అమలు అవుతున్నాయన్నారు. రాబోవు కాలంలో అన్ని హామీలు అమలుకు సీఎం కట్టుబడి ఉన్నారని తెలిపారు.

రూ.26 కోట్లు ఉత్తిదేనా..?

గ్రామాలకు మహర్దశ పట్టిస్తాం.. కడప నగరానికి వచ్చిపోయేందుకు మంచిదారి ఏర్పాటు చేస్తాం.. కోట్లాది రూపాయలు మంజూరు చేసి మీకు సురక్షిత ప్రయాణం కల్పిస్తామని చెప్పిన నాటి వైసీపీ నేతల మాటలు నీటి మూటలని తేటతెల్లమయ్యాయి. రూ.26 కోట్లు మంజూరయ్యాయి.. అదిగో రోడ్డు.. ఇదిగో హైలెవల్ వంతెన.. నిర్మించేస్తాం అని ఏడాది క్రితం వైసీపీ నేతలు హంగామా చేశారు. అది ఉత్తుత్తి హంగామా అని తేలిపోయింది. ఏడాది దాటినా అందులో ఒక్క శాతం పనులు కూడా పూర్తి కాలేదు. అసలు నిధులే మంజూరు కాలేదు.

- నిధులు మంజూరయ్యాయంటూ నాడు వైసీపీ హంగామా
- ఏడాది జరిగినా.. ఒక్క శాతం పనులూ పూర్తి కాలేదు
- కడప నగరాన్ని కలిపే.. నాలుగు గ్రామాల రోడ్ల గతి అంతేనా
- గుంతలతో నిత్యం జనం సతమతం


రాచిన్నాయపల్లెలో సిమెంటు రోడ్డు సగమే వేయడంతో ప్రమాదకరంగా ఉన్న దృశ్యం


గుంతలమయమైన కడప వైపునకు వెళ్లే రోడ్డు


ముండ్లపల్లె, ఓబులంపల్లె మధ్య ఉప్పువంకపై తక్కువ ఎత్తులో ఉన్న కల్వర్టు


రాచిన్నాయపల్లె పాలంపల్లె మధ్యలో చిన్న లోలెవల్ కాజ్‌వే

చెన్నూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు మండల పరిధిలోని గుర్రంపాడు, ముండ్లపల్లె, రామనపల్లె, రాచిన్నయపల్లె గ్రామాలు కడప నగరానికి సమీపంలో ఉన్నాయి. ఈ నాలుగు గ్రామాల్లో విద్యార్థులు, వ్యవసాయ కూలీలు, రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు ఎక్కువ. వీరంతా నిత్యం కడపకు వెళుతుంటారు. అయితే ఎన్నో ఏళ్లగా ఈ నాలుగు గ్రామాల నుంచి కడపకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. జనం రాకపోకలు ఎక్కువ, రోడ్డు వెడల్పు తక్కువ కావడంతో ప్రజలు నిత్యం సతమతం అవుతున్నారు. పైగా ఎదురెదురుగా ఆటోలు వచ్చినా వెళ్లాలంటే ఇబ్బందికర స్థితి. వర్షాలతో ఉన్న రోడ్లు మొత్తం గుంతలే. అలాంటి దారిని నాటి వైసీపీ పాలకులు ఎన్నికల అవకాశంగా ఎంచుకున్నారు. పీఆర్ఎస్ పథకం కింద రూ.26 కోట్లు మంజూరు అయ్యాయని, టెండరు కూడా అయిపోయిందని ప్రజలకు నమ్మబలికించారు. వెంటనే పనులు కూడా మొదలు పెట్టారు. దీంతో ప్రజలు రోడ్డు వస్తుందని సంబరపడ్డారు. రాచిన్నాయపల్లెలో కొంత వరకు వదిలిపెట్టి అడుగున్నర ఎత్తుతో సిమెంటు రోడ్డు వేస్తున్నామంటూ కొంతమేర పనిచేశారు. వెంటనే పని ఆపేశారు. కారణం నిధులు మంజూరు కాకపోవడమే.

నమ్మించి మోసం చేశారు

రోడ్డు పనులు మొదలు కావడంతో ఈ నాలుగు గ్రామాల ప్రజలు సంతోషించారు. కడప నగరానికి వెళ్లడానికి ఇక ఇబ్బంది ఉండదనుకున్నారు. కానీ రోడ్డు పనులు అర్ధంతరంగా ఆపేశారు. ఫలితంగా ఓ వైపు అడుగున్నర ఎత్తు సిమెంటు రోడ్డు.. మరోవైపు అడుగున్నర లోతు గుంత దారి మిగిలాయి. ఈ మార్గంలో రాత్రివేళ రాకపోకలు సాగించేవారు పలువురు గుంతల్లో పడి గాయాలపాలయ్యారు. అందులో కొందరికి కాళ్లు, చేతులు విరిగాయి. రోడ్డు పనులు ఆగిపోవడంపై స్థానికులు విచారించగా.. అసలు నిధులే మంజూరు కాలేదని తెలిసింది. దీంతో వీరంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నరోడ్డును తవ్వేసి సగం వేయకపోతే ప్రమాదాలు జరిగేవి కాదుకదా.. ఓట్లకోసం నమ్మించి మోసం చేస్తారా అని వైసీపీ నేతలపై మండిపడుతున్నారు.

హైలెవెల్ వంతెనా ఒట్టిమాటే


రాచిన్నాయపల్లె నుంచి పాలెంపల్లె బైపాస్‌రోడ్డు వెళ్లే దారిలో రాళ్లవంకపై లోలెవల్ కాజ్‌వే ఉంది. ఈ వంకపై హైలెవల్ వంతెన నిర్మించాల్సి ఉంది. ప్రతి ఏటా వర్షాకాలంలో ఈ వంక పొంగడంతో కడప నగరం కళ్లముందు కనిపిస్తున్నా కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. అలాగే ముండ్లపల్లె గుర్రంపాడు పక్కపక్క గ్రామాలైనా.. వీటి మధ్య ఉప్పువంక ఉంది. అక్కడా లోలెవల్ కాజ్‌వే ఉంది. ఇక్కడ కూడా వంక పొంగినప్పుడు రెండు గ్రామాల ప్రజలు వ్యవసాయపనులకు ఇతరత్రా వెళ్లాలన్నా రోజులకొద్ది నిరీక్షించాలి. రూ.26కోట్లతో చేపట్టే పనుల్లో భాగంగా ఈ రెండుచోట్లా హైలెవల్ వంతెనలు వస్తాయని ఆశించారు. చివరకు వారి ఆశ నిరాశే అయింది. ఏడాది దాటినా ఆ నిధుల్లో ఒక్క శాతం పనులు కూడా జరగలేదు. కేవలం రాచిన్నాయపల్లెలో వంద మీటర్లు, గుర్రంపాడు నుంచి దేవునికడప ఆర్చి వరకు అక్కడక్కడా చిన్నపాటి కల్వర్టుల పనులు మాత్రమే జరిగాయి. కూటమి ప్రభుత్వమైనా దీనిపై దృష్టి సారించాలని తమకు ప్రయాణ ఇబ్బందులు లేకుండా ఉండేలా చేయాలని కోరుతున్నారు.

నిధులు మంజూరు కాలేదు..

ఈ నాలుగు గ్రామాల రోడ్ల కోసం రూ.26 కోట్లు మంజూరు చేస్తామని మొదట పై నుంచి అధికారులు చెప్పారు. ఆ తరువాత నిధులు మంజూరు కాలేదు. పనులు కూడా అంతంతమాత్రమే జరిగాయి. నిధులు రాగానే పనులు మొదలుపెట్టిస్తాం. రాచిన్నాయపల్లెలో కొంతవరకే సిమెంటు రోడ్డు పనులు జరిగాయి. మిగిలిన రోడ్డు పని కూడా పూర్తి అవుతుంది. ఇబ్బంది లేకుండా పనులు జరుగుతాయి. ఆర్‌అండ్‌బి పరిధిలో ఈ పనులన్నీ పూర్తయ్యేలా చూస్తాం.

- కళ్యాణి, డీఈ, ఆర్‌అండ్‌బీ

వారివన్నీ ఉత్తుత్తి మాటలే..



వైసీపీ పాలకులు రూ.26కోట్లు మంజూరు చేశామని నాలుగు గ్రామాల ప్రజలను నమ్మించి మోసం చేశారు. వారివన్నీ ఉత్తుత్తి మాటలే. అసలు నిధులే మంజూరు కాకపోయినా మంజూరైనట్లు, మంజూరు చేయించినట్లు డ్రామా ఆడారు. ముందు ప్రజలు గుర్తించకపోయినా ఎన్నికలనాటికి వాస్తవాలు తెలుసుకుని బుద్ధి చెప్పారు. ఇప్పుడున్న కూటమి ప్రభుత్వంలో కచ్చితంగా ఈ నాలుగు గ్రామాల మధ్య డబుల్ రోడ్డు, హైలెవల్ వంతెన వస్తాయని నమ్మకం ఉంది.

- తాడిగొట్ల వెంకటసుబ్బారెడ్డి, రామనపల్లె

అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

పెనగలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల ప్రభుత్వ సిబ్బంది ప్రత్యేక చొరవ కనబర చాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం మండల పర్యటనకు వచ్చిన ఆయన మండల పరిషత్ సభాభవనంలో అభివృద్ధి పనులపై ప్రభుత్వ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆయన శాఖల వారీగా ప్రగతిని తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీరు, రెవెన్యూ సమస్యలపై వాకబు చేశారు. ఉచిత ఇసుక రవాణా గురించి ఆరా తీశారు. గృహనిర్మాణ లక్ష్యాలను త్వరితగతిన వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశం అనంతరం సిద్దవరం గ్రామానికి చెందిన న్యాయవాది గోపిగారి రెడ్డెయ్య, సింగనమల సర్పంచ్ ఎర్రి శివయ్య తదితరులు సిద్దవరం గ్రామ పరిధిలో జరిగిన పలు భూఆక్రమణల గురించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇండ్లూరు, కొత్తపల్లె గ్రామాలకు చెందిన ముస్లింలు నూర్‌బాషా, దూదేకుల సంఘం సభ్యులు గ్రామంలో ఉన్న ఒక మసీదుకు అనుసంధానంగా ఈద్గా ఒకటి ఉందని, గ్రామంలోని ఒక వ్యక్తి ఇంకో ఈద్గాను నిర్మించాలని చూస్తున్నారని, దానిని నిలుపుదల చేయాలని కోరారు. వెంటనే స్పందించిన కలెక్టర్ డిప్యూటీ కలెక్టర్ శివజ్యోతిని విచారణకు ఆదేశించారు. కొత్తపల్లెలోని జామియా మసీదు ప్రాంతాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల ద్వారా స్టేట్‌మెంట్‌లను రికార్డు చేశారు. సమావేశం అనంతరం కలెక్టర్ నారాయణనెల్లూరు, కోమంతరాజపురం ఇసుక క్వారీలను తనిఖీ చేశారు.

యువకుడి దారుణ హత్య



సంఘటనా స్థలం వద్ద పోలీసు జాగిలంతో సిబ్బంది



హత్యకు గురైన వెంకటనారాయణ

రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ పరిధిలోని చౌడవరం చెరువు కట్ట సమీపం చియ్యవరం గ్రామానికి వెళ్లే దారిలో బుధవారం ఓ యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి దారుణంగా హత్య చేశారు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని ఉర్లగట్టుపోడు గ్రామానికి చెందిన పిటాని వెంకటనారాయణ (39) నియోజకవర్గంలో టైల్స్ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. ఈయన ఓబులవారిపల్లె మండలంలోని వై.కోట గ్రామంలో ఒక అమ్మాయితో సహజీవనం చేస్తున్నాడని, హత్యకు ఇదే కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు వెంబడించి కత్తులతో మెడ వద్ద పొడిచినట్లు ఆనవాళ్లు ఉన్నాయని, అక్కడికక్కడే మృతిచెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. సంఘటన సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు సీఐ కె.హేమసుందరావు, ఎస్ఐ నవీన్‌బాబు తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వెంటనే పోలీసు జాగిలం వచ్చి పరిశీలించింది. హత్యకు గల కారణాలపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. శవాన్ని శవపరీక్ష నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. అయితే వెంకటనారాయణ స్వగ్రామం వెస్ట్ గోదావరి అని తెలిసింది. రైల్వేకోడూరు మండలంలోని ఉర్లగట్టుపోడు అడ్రస్‌కు ఆధార్ కార్డును మార్పు చేసుకున్నాడు. మృతుడి స్వగ్రామ పరిధి పోలీస్‌స్టేషన్‌లో వెంకటనారాయణ మిస్సింగ్ అయినట్లు ఫిర్యాదు ఉందని తెలిసింది. వీటన్నింటిపై పోలీసులు విచారిస్తున్నారు.

కుక్కర్ పేలి మహిళకు తీవ్రగాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ అమీరున్

పెద్దతిప్పసముద్రం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కుక్కర్ పేలి ఓ మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు, కుటుంబ సభ్యులు అందించిన సమాచారం మేరకు మండలంలోని రంగసముద్రం పంచాయతీ విసనకర్రవాండ్లపల్లెకు చెందిన ఓ నిరుపేద సిద్దయ్య భార్య అమీరున్ ఇటీవల ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు కుక్కర్ పేలడంతో తీవ్రంగా గాయపడింది. దీంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే స్తోమత లేక నాలుగు రోజుల నుంచి ఇంటివద్దే ప్రథమ చికిత్స చేయించుకుంటూ ఉండేది. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన పలువురు యువకులు నగదు పోగుచేసి బాధితురాలి ఇంటి వద్దకు వెళ్లి బుధవారం కొంత ఆర్థికసాయం చేసి మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దీంతోపాటు గాయాలు నయం అయ్యేంత వరకు అయ్యే ఖర్చు తాము భరిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవలే అమీరున్ భర్తకు ఆరోగ్యం సరిగా లేక అప్పులు చేసి పలు ఆసుపత్రుల్లో చికిత్స అందించారు. ఇప్పుడు ఈమెకు ఇలా జరగడంతో ఆ కుటుంబం ఇబ్బందులు పడుతోంది. కాగా బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేసిన యువకులను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

మదనపల్లెలో ప్రకాశం జిల్లా వాసి మృతి



మృతి చెందిన నజీర్ అహ్మద్

మదనపల్లెఅర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాకు చెందిన వృద్ధుడు బుధవారం మదనపల్లెలో మృతి చెందినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. సింగరాయకొండ సెల్‌టవర్ వీధిలో నివాసం ఉండే నజీర్ అహ్మద్(66) మదనపల్లెలో ఉండే బంధువుల ఇంటికి సొంత పనినిమిత్తం వచ్చాడు. అనంతరం తిరిగి సొంతూరుకు వెళ్తుండగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్నపలంగా కిందపడి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు సీఐ తెలిపారు.

పెన్నానదిలో పడిన బాలుడి మృతదేహం లభ్యం



మణికంఠ (ఫైల్)

కడప క్రైం/సిద్దవటం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధి మృత్యుంజయకుంటలో నివసించే మణికంఠ (16)అనే బాలుడి మృతదేహం ఎట్టకేలకు పెన్నానదిలో బుధవారం లభ్యమైంది. వాటర్ గండి సమీపంలో నవంబరు 3న స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. బాలుడు కనిపించకపోవడంతో బాలుడి తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిన్నచౌకు పోలీసులు ఈ నెల 4న మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. ఈ క్రమంలో గాలింపు చర్యలు చేపట్టగా పెన్నానదిలో బాలుడి మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

అపార్‌కు ఆమోదం కష్టాలు..!!

● సేవల ఆమోదానికి నిరీక్షణ..!

● ఆధార్ సెంటర్లలో నమోదైనా.. హోల్డ్‌లోనే

● వార్డు, గ్రామ సచివాలయాల్లోనూ ఇదే పరిస్థితి

● క్యూ కడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలోని ఆధార్ సెంటర్ వద్ద జనాల రద్దీ

మదనపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న ఒకే దేశం.. ఒకే విద్యార్థి అనే నినాదంతో అపార్ ఐడీని కేటాయిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు ఆధార్ తరహాలో 12 అంకెల నెంబర్‌ను కేటాయించనున్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లు, వారి ఆధార్ కార్డుల్లో వివరాలు ఒకే విధంగా ఉండాలన్నది నిబంధన. వీటిని సరిపోల్చితే, విద్యార్థుల వివరాల్లో 50 శాతానికిపైగా తప్పులు, పొరపాట్లు చోటు చేసుకున్నాయి. తప్పుల తడకగా ఉన్న విద్యా సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుల్లో మార్పులు, చేర్పులకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధార్ సెంటర్లకు ప్రస్తుతం క్యూ కడుతున్నారు. ఇక్కడా వీరు తెచ్చే వివరాలు సరిపోలకపోవడంతో వారంతా మరోసారి విద్యాసంస్థలు, మున్సిపల్, పంచాయతీ, సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు. జనన ధ్రువీకరణ పత్రం, అందులోని సంవత్సరం, తేదీలో కరెక్షన్, పేరు మొదట్లో ఇన్సిల్ కాకుండా సర్‌నేమ్ ఉండేలా దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారు. ఇలా అటు ప్రభుత్వ కార్యాలయాలు, ఇటు ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అన్నీ సక్రమంగా ఉంటే ఆధార్ సెంటర్‌లో ఒకరోజులో పని అవుతుండగా, రికార్డులు, ఆధార్‌లలో తప్పొప్పులు ఉంటే మూడు, నాలుగు రోజులు పడుతోంది. దీంతో విద్యార్థులు అటు స్కూల్స్‌కు వెళ్లలేక, వారి తల్లిదండ్రులు పనులు వదులుకుని అటు ఆధార్, ఇటు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పోనీ ఇన్నీ అయినా.. ఆధార్‌లో సవరణలు పూర్తయ్యాక వెంటనే పని అవుతుందా? అంటే అదీ లేదు. ఆధార్ మెయిన్ సర్వర్‌లో యాక్టివ్ కావడానికి నెలా, నెలన్నర సమయం పడుతోంది. నెలన్నరరోజుల క్రితం వరకూ నాలుగు నుంచి వారం రోజుల్లో పూర్తయిన ప్రక్రియ, ప్రస్తుతం నెలరోజులకు పైగా పడుతోందని చెబుతున్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధార్ సెంటర్, వార్డు, గ్రామ సచివాలయాలు, బ్యాంకులు, పోస్టాఫీసుల్లోని ఆధార్ సెంటర్లకు తిరుగుతున్నారు. ఎప్పుడు యాక్టివ్ అవుతుందని, సరిచేసిన పత్రాలు తమకు ఎప్పుడు అందుతాయని వారు నిరీక్షిస్తున్నారు. ఆయా సెంటర్లలో స్టేటస్ చూస్తే సర్వీస్ ఆన్ హోల్డ్ అని, యాక్టివేషన్ పెండింగ్ అని చూపెడుతోంది. మరోవైపు సరైన ధ్రువపత్రాలు సమర్పించని వారి సేవలు చాలా వరకూ రిజెక్ట్ అవుతున్నాయి. ఆ సమాచారం తెలియడానికి కూడా ఇంతే సమయం పడుతుండగా, అలాంటి వారంతా తిరిగి ఆధార్ గడప తొక్కాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు.

జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట డివిజన్‌లలో మొత్తం వంద వార్డు, గ్రామ ఆధార్‌సెంటర్లు ఉన్నాయి. జిల్లాలోని అయిదు సచివాలయాల పరిధిలో ఒక్కో సచివాలయంలో మూడు విడతలుగా 2022 నుంచి వీటిని ఏర్పాటు చేశారు. సచివాలయంలో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్ వీటిని ఆపరేట్ చేస్తున్నారు. ఇందులో కొత్త ఆధార్‌తో పాటు ఆధార్ అప్‌డేట్, డెమోగ్రఫిక్ అప్‌డేట్స్, డేట్ ఆఫ్ బర్త్, సర్‌నేమ్‌తో సహా సవరణలు చేస్తున్నారు. ఈ కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటి నుంచీ రోజుకు సగటున ఒక్కో కేంద్రంలో పది సర్వీసులు వస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇవి కూడా నాలుగైదు రోజుల్లో ఆమోదం అయ్యేవి. కానీ ప్రస్తుతం నెల, నెలన్నరరోజులుగా ఆ పరిస్థితి లేదు. సేవలన్నీ ఆన్‌హోల్డ్ అని చూపెడుతోంది. వీటిపై డిజిటల్ అసిస్టెంట్స్ ఎప్పటికప్పుడు టెక్నికల్ సిబ్బంది, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమాధానం లేదని చెబుతున్నారు. అయితే సచివాలయాలు, ఆధార్ సెంటర్లకు వచ్చే బాధితులకు ఏమని సమాధానం చెప్పాలని వారు వాపోతున్నారు. సరైన సమాచారం లేక వారు తలపట్టుకుంటున్నారు. ఇదిలా వుండగా మదనపల్లె మున్సిపాలిటీలో మొత్తం 44 వార్డు సచివాలయాలు ఉండగా, అందులో అమ్మచెరువుమిట్ట, రామిరెడ్డిలేఅవుట్, అమ్మినేనివీధి, గొల్లపల్లె, రామారావు కాలనీ, సుభాష్ రోడ్డు, బాకవానితోట, నెహ్రూబజార్, వడ్డిపల్లె సచివాలయాల్లో అనుసంధానంగా ఆధార్ సెంటర్లు ఉన్నాయి. ఇలా జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయాలే కాదు.. మీ-సేవా కేంద్రాలలో, బ్యాంకులు, పోస్టాఫీసులు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలలో ఇలా సుమారు 360 ఆధార్‌కేంద్రాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఇందులో ఆయా ఏజెన్సీల పరిధిలో సర్వీసులు నడుస్తున్నాయి.



జననధ్రువీకరణ పత్రంలో మార్పులకోసం మున్సిపల్ కార్యాలయంలో క్యూ కట్టిన ప్రజలు

వారు అలా.. వీరు ఇలా..

అపార్ ఐడీలో భాగంగా ఆధార్‌లో మార్పులు, చేర్పులకు స్టడీ సర్టిఫికెట్ పెట్టి మార్చుకుని రమ్మని విద్యాసంస్థలు చెబుతుండగా, దాని ఆధారంగా ఆధార్‌లో మార్పులు చేర్పులు చేసే అవకాశం లేదని కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు. ఒక వేళ ఆ విధంగా చేసినా రిజెక్ట్ అవుతున్నాయి. బర్త్ సర్టిఫికెట్ లేదా పదో తరగతి మార్కుల లిస్టు మాత్రమే తీసుకుంటున్నారు. నేమ్ కరెక్షన్‌కు 18 ఏళ్ల లోపు ఉన్న వారికి జనన ధ్రువీకరణ పత్రం, ఆపైన ఉన్న వారికి మార్కులలిస్టు పెడుతూ, తల్లి లేదా తండ్రి ఫింగర్ ప్రింట్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆధార్ కార్డులో తల్లిదండ్రుల పేరులో ఏమాత్రం తేడా ఉన్నా తీసుకోవడం లేదు. ఇవన్నీ సక్రమంగా ఉంటేనే ఆధార్‌లో సవరణ ప్రక్రియ జరుగుతోంది. తర్వాత జరిగే అమోదంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. గతంలో నాలుగురోజుల్లో ఆమోదం పొందే సేవలు ప్రస్తుతం నెల, నెలన్నర సమయం తీసుకుంటున్నట్లు బాధితులు వాపోతున్నారు. మధ్యలో సర్వీసును చెక్ చేస్తే అండర్ ప్రాసెస్, ఆన్ హోల్డ్ అని చూపెడుతోంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సమాధానం చెప్పలేని నిర్వాహకులు ఆధార్‌లో ఒకసారి మార్పు చేస్తే 90 రోజుల్లో ఎప్పుడైనా ఆమోదం కావచ్చని చెప్పి పంపుతున్నారు.

టమోటాకు వాతావరణ ఆధారిత ఇన్సూరెన్స్

● జిల్లా ఉద్యానశాఖ అధికారి పి.రవిచంద్రబాబు



ఇన్సూరెన్స్ గురించి వివరిస్తున్న డీహెచ్‌వో రవిచంద్రబాబు

కలికిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసే టమోట పంటకు ఇన్సూరెన్సు సౌకర్యం అందుబాటులోకి తెచ్చినట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి పి.రవిచంద్రబాబు వెల్లడించారు. ఈ ఏడాది అక్టోబరు 15 నుంచి డిసెంబరు 15 మధ్య సాగు చేసే పంటకు ఈ ఇన్సూరెన్సు వర్తిస్తుందని ఆయన చెప్పారు. పీలేరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన సచివాలయాల ఉద్యాన సహాయకులకు, శాస్త్రవేత్తలకు టమోట పంటకున్న ఇన్సూరెన్సు గురించి స్థానిక కేవీకేలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉద్యానశాఖ పరిధిలో నాలుగు వేల ఎకరాల సాగుతో టమోట పంట రెండవ స్థానంలో వుందని చెప్పారు. రబీ సీజన్‌లో సాగయ్యే టమోట పంటకు వాతావరణ ప్రతికూలతల కారణంగా నష్టం వాటిల్లితే ఇన్సూరెన్సు వర్తిస్తుందని హామీ ఇచ్చారు. రైతులు ఎకరాకు రూ.1600 ప్రీమియం చెల్లించాల్సి వుందని, అదే సమయంలో పంటకు నష్టం వాటిల్లితే రూ.32 వేలు పరిహారంగా వస్తుందని తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రాల్లో కూడా ప్రీమియం చెల్లించే అవకాశం కల్పించినట్లు చెప్పారు. భూమికి సంబంధించిన 1బి, ఆధార్, బ్యాంక్ అకౌంటు, పంట ధ్రువీకరణలు సమర్పిస్తే చాలని వివరించారు. ఇన్సూరెన్సు కోసం జిల్లాకు ఇఫ్కో టోక్యో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఆయా ఉద్యాన సహాయకులు రైతుల్లో విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలని సూచించారు. కేవీకే కోఆర్డినేటర్ మంజుల మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులను వాడుతూ పసుపు, బులుగు రంగుల జిగురు అట్టలు అమర్చడం ద్వారా ఉద్యాన పంటల్లో తెగుళ్ల నివారించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో పీలేరు, వాల్మీకిపురం ఉద్యాన అధికారులు టి.సుకుమార్‌రెడ్డి, ఇ.ఈశ్వర్‌ప్రసాద్ రెడ్డి, కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాస్, కలికిరి, కలకడ, కేవీ పల్లె, గుర్రంకొండ, పీలేరు మండలాల్లోని ఆర్ఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాపాడాలి

- డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్‌తో కార్మిక నాయకుల చర్చలు



లేబర్ అధికారులతో మాట్లాడుతున్న కార్మిక నాయకులు

ఓబులవారిపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీఎండీసీ సంస్థ నందు పనిచేస్తున్న కార్మికుల హక్కులను కాపాడాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కార్మిక పోరాట సమితి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాదులోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వారితో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ వెంకటేశ్, తదితరులు మాట్లాడారు. ఏపీఎండీసీ యాజమాన్యం అనేక రోజులుగా కార్మికుల సమస్యలపై కాలయాపన చేస్తూ పరిష్కారం చేయలేదన్నారు. అంతే కాకుండా 2021-22కు సంబంధించి కార్మికులకు బోనస్ తక్కువగా ఇచ్చారని, పెండింగ్ మెడికల్ బిల్లులు హెల్త్ ఇండియా కంపెనీ రూ.25 లక్షలు ఎగ్గొట్టి వెళ్లిందని ఆరోపించారు. ఆ మొత్తాన్ని ఏపీఎండీసీ యాజమాన్యం ఇవ్వాలని కోరారు. ఈ విషయంలో హెల్త్ ఇండియా వారితో మాట్లాడి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అదేవిధంగా చనిపోయిన 7 మంది కార్మిక కుటుంబాలకు రూ.10 లక్షల డెత్ ఇన్సూరెన్స్ ఇవ్వలేదని, చనిపోయినా, పదవీ విరమణ పొందినా, ఔట్ సోర్సింగ్ ట్రైనీ కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు చట్ట ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని తెలిపారు. అన్ని సమస్యలు కచ్చితంగా పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ చర్చల్లో ఏపీఎండీసీ అడిషనల్ జనరల్ మేనేజర్ జోసెఫ్, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మహేష్ సెట్టికర్, పోరాట కమిటీ నాయకులు సుబ్రమణ్యం, గోవిందు, వెంకటేశ్, ఈశ్వరప్ప, చంద్ర, వెంకటరమణ పాల్గొన్నారు.

ట్రంప్ విజయం పట్ల సతీశ్ వేమన హర్షం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సతీశ్ వేమన (ఫైల్)

రాజంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తానా మాజీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సతీశ్ వేమన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత కొద్ది నెలలుగా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల నిరీక్షణకు తెరదించుతూ అమెరికా సంయుక్త రాష్ట్రాల 47వ అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికయ్యారని తెలిపారు. ఎన్నో మలుపుల మధ్య గత కొద్ది నెలలుగా హోరాహోరీగా ప్రచారం సాగించి ఎట్టకేలకు విజయం సాధించారని, ఈ విజయం వెనుక భారతీయ ప్రముఖుల కృషి ఉందన్నారు. తెలుగు వారు అత్యధికంగా ఉన్న తూర్పు రాష్ట్రాల్లో ట్రంప్ ప్రతినిధులతో కలిసి తాను సంవత్సరకాలం పాటు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. కాగా భారత, అమెరికా సంబంధాలు ఎప్పటిలాగే సుహృద్భావ వాతావరణంలో, సోదరభావంతో కొనసాగుతాయని ఆశిస్తున్నానని, తద్వారా ఇరుదేశాల అభివృద్ధి, యువతకు ఉపాధి లభిస్తుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కడపక్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప నగరం దేవునికడప ఆర్చి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు చిన్నచౌకు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. పాతకడపకు చెందిన వెన్నపూస రామసుబ్బారెడ్డి (55) పనిమీద బైపాస్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా వేగంగా వచ్చిన తుఫాను వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాయ్యాడు. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా అక్కడ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గంగప్ప

పెద్దమండ్యం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన పెద్దమండ్యం మండలంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఎన్నేపల్లె పంచాయతీ గౌనివారిపల్లెకు చెందిన గంగప్ప(50) వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. మండలంలోని కోటగాడపల్లెకు సొంత పనుల నిమిత్తం టీవీఎస్‌లో వెళ్తుండగా ఆటో వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగప్ప తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో గంగప్ప అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ వీపీ రమణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లా విజిలెన్స్ కమిటీలో పీలేరు వాసులు



శ్రీనివాసులు, బోదేషావలి

పీలేరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలో పీలేరుకు చెందిన ఇద్దరికి స్థానం దక్కింది. భారతీయ అంబేడ్కర్ సేన నాయకుడు పాలకుంట శ్రీనివాసులు, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలిని సభ్యులుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు వారిద్దరికీ బుధవారం నియమాకపత్రాలు అందాయి. విజిలెన్స్ కమిటీలో స్థానం దక్కించుకున్న వారిద్దరినీ పలువురు అభినందించారు.

రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను వెంటనే రద్దు చేయాలి

● యూటీఎఫ్, ఏపీసీపీఎస్ఈఏ నాయకులు

పీలేరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష అభియాన్ ద్వారా ఉపాధ్యాయులకు అందిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్, ఏపీసీపీఎస్ఈఏ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో బుధవారం యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదాశివరెడ్డి, ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ వేర్వేరుగా విలేఖరులతో మాట్లాడారు. లీడర్‌షిప్, ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగుల పేరుతో ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, ఎంఈవోలను తమ సమీప ప్రాంతాల్లో కాకుండా దూర ప్రాంతాల్లో, మారుమూల ప్రాంతాల్లో ఉన్న శిక్షణా కేంద్రాల్లో ఆరు రోజులపాటు రెసిడెన్షియల్ పద్ధతిలో ఉండాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులకు కడపలో అరకొర వసతులు ఉన్న శిక్షణ కేంద్రంలో శిక్షణ ఏర్పాటు చేశారన్నారు. 50 ఏళ్లు పైబడిన ఉపాధ్యాయులు శిక్షణ తీసుకోవడం కష్టతరంగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు దృష్టిలో పెట్టుకుని ఆ శిక్షణను మండల కేంద్రాల్లో నిర్వహించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శిక్షగా మారిన శిక్షణను ఉపాధ్యాయులపై రుద్దడం సరికాదని, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ జోక్యం చేసుకుని దీన్ని రద్దు చేయాలన్నారు.

సైబర్ కేటుగాళ్లు పొంచి ఉన్నారు..

- ఆన్‌లైన్ సేవల వినియోగంలో తొందరపాటు వద్దు
- కొత్త కొత్త తరహాలో సైబర్ మోసాలు
- అప్రమత్తంగా లేకపోతే ఖాతాలో డబ్బు ఖాళీనే



కడప క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సైబర్ నేరాలు పెచ్చుమీరుతున్నాయి. మోసపోయేవారు ఉన్నంత వరకు మోసం చేసే వారు పుడుతూనే ఉంటారు. ఈజీ మనీ కోసం కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. నెట్ ఉపయోగించి ఎన్ని రకాలు కావాలంటే అన్ని రకాల మోసాలకు పాల్పడుతున్నారు. వీరి ఉచ్చులో పడితే సర్వం దోచేస్తారు. నార్త్ రాష్ట్రాల సైబర్ నేరగాళ్లు (ఆడవాళ్లు) తియ్యటి మాటలతో బుట్టలో వేసుకుంటారు. మాయమాటలు చెప్పి ఖాతా వివరాలు తెలుసుకుని డబ్బులను దోచుకుంటున్నారు. మరికొందరు వీడియో కాల్.. లోన్ యాప్ వంటి రకరకాల పద్ధతులలో మోసం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి మోసాలన్నీ తెలిసీ మరీ మనం మోసపోతూనే ఉన్నారు.

ఇటీవల కడపకు చెందిన ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్‌కు ఒక లింకు రావడంతో దాన్ని క్లిక్ చేశాడు. అంతే అతని ఖాతాలో ఉన్న డబ్బులన్నీ దోచేశారు. ఉద్యోగం పేరుతో ఓ మహిళ నుంచి లక్షలు కాజేశారు. ఓ విశ్రాంత ఉద్యోగికి అయితే వీడియో కాల్ చేసి నగ్నంగా ఉన్న చిత్రాలు గ్రూపులో పెడతానంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి అతని వద్ద లక్షలు దోచేశారు. ఇక ఈకేవైసీ, స్కానర్ లాంటి వాటి అధారంగా మోసాలకు పాల్పడుతూనే ఉన్నారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో ఎక్కడో ఒక చోట చోటు చేసుకుంటూనే ఉన్నాయి. సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నా కొత్త కొత్త పద్ధతుల్లో సైబర్ నేరగాళ్లు మోసాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

లోన్ యాప్‌లతో తస్మాత్ జాగ్రత్త

డబ్బు అవసరం ఉందని లోన్ యాప్‌ను ఆచరించారా అంతే సంగతులు. తీసుకున్న డబ్బు కంటే పదింతల రెట్టింపు వసూళ్లు చేస్తున్నారు. డబ్బు చెల్లిస్తున్నా కొత్త కొత్త నెంబర్లతో ఫోన్లు చేసి వారిని మానసికంగా శారీరకంగా హింసకు గురి చేయడంతో పాటు డబ్బు ఇవ్వకపోతే నగ్నంగా ఉన్న మీ ఫొటోలను మీ కాంటాక్ట్ నెంబర్లకు పోస్టు చేస్తామంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతూ డబ్బులు దోచుకుంటున్నారు. మోసపోయిన బాధితులు కొందరు పోలీసులను ఆశ్రయిస్తే.. మరికొందరు బయటకు చెప్పుకోలేక నిమ్మకుండిపోతున్నారు. ఏది ఏమైనా లోన్ యాప్ పట్ల అప్రమత్తంగా ఉండాలి.

బ్యాంకు అధికారులమంటూ ఫోన్లు చేస్తే నమ్మవద్దు

మీ బ్యాంకు ఖాతా క్లోజ్ చేస్తున్నామని... మీ అకౌంటు వివరాలు చెప్పాలని ఎవరైనా ఫోను చేస్తే వారి మాటలు నమ్మి మోసపోవద్దు. ఏ బ్యాంకు అధికారులు కూడా మీకు ఫోను చేయరు. అలాంటి వారి మాటలు నమ్మి మీ అకౌంటు వివరాలు ఎట్టి పరిస్థితుల్లో చెప్పకపోవడమే మంచిది.

ఈకేవైసీ ఆధార్ వివరాలు చెప్పవద్దు

ఏఈపీఎస్ వినియోగిస్తున్న కస్టమర్ల పూర్తి వివరాలను సైబర్ నేరగాళ్లు సేకరిస్తుంటారు. కొంతమంది బ్యాంకులకు వెళ్లలేక పదివేల లోపు డబ్బు కోసం ఏఈపీఎస్ వినియోగిస్తున్నారు. దీంతో సైబర్ నేరగాళ్లు మన వేలిముద్రలను సేకరించి మన ప్రమేయం లేకుండానే ఈజీగా డబ్బులు కాజేస్తున్నారు. ఖాతాదారులు బ్యాంకులకు వెళ్లి డబ్బులు డ్రా చేసుకోవడమే మంచిది.

ఏటీఎం సెంటర్ల వద్ద ఏమరుపాటు వద్దు

ఏటీఎం కేంద్రాల వద్ద డబ్బులు డ్రా చేసుకునేందుకు వెళ్లేవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏటీఎం మెషిన్‌లో కార్డు పెట్టి సీక్రెట్ నెంబరు కొట్టేటప్పుడు ఎవరికీ కనిపించకుండా వినియోగించడం మంచిది. ఏటీఎం వినియోగించడం చేతకాని వారు తెలిసిన వ్యక్తుల ద్వారా డబ్బులు డ్రా చేసుకోవాలి తప్ప కొత్త వ్యక్తులను నమ్మి వారికి కార్డులు ఇవ్వడం మంచిది కాదు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతులలో నేరాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఆండ్రాయిడ్ మొబైల్ వినియోగిస్తున్నా రని.. ప్రతీది ఆన్‌లైన్ ద్వారానే కొనుగోలు చేసి డబ్బుల చెల్లింపులు చేస్తున్నారు. ఈవిషయంలో అప్రమత్తంగా ఉండాలి. బ్యాంకుకు సం బంధించిన ఖాతాలు, వ్యక్తిగత వివ రాలను ఇతరులకు తెలియపరచకపోవడమే మంచిది. సెల్‌ఫోన్‌లోకి వచ్చే లింకులకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

-మధుమల్లేశ్వర్‌రెడ్డి, సైబర్ సెల్ సీఐ

రక్తదానంతో సంపూర్ణ ఆరోగ్యం



రక్తదాన శిబిరంలో విద్యార్థికి పండ్ల రసం ఇస్తున్న వీసీ, ప్రిన్సిపాల్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ఎన్ఎస్ఎస్, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరానికి విద్యార్థులు, అధ్యాపకుల నుంచి మంచి స్పందన లభించింది. వైవీయూ డీఓఏ కార్యాలయంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వీసీ క్రిష్టారెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానంతో ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని బతికించిన వారవుతారని అన్నారు. ఆరోగ్య వంతులైన ప్రతి ఒక్కరూ ఆరు మాసాలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ పీఓ వెంకటరామిరెడ్డి మాట్లాడారు. వైవీయూ ఆరోగ్య కేంద్రం డాక్టర్ నరేశ్, రెడ్‌క్రాస్ సంస్థ వైద్యాధికారి ఎస్ఎస్‌వీ రెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓలు పాల్గొన్నారు.

విద్యాదాత ఝాన్సీలక్ష్మీభాయి



సంబరాలు చేసుకుంటున్న శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య తదితరులు

సికెదిన్నె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ ఝాన్సీలక్ష్మీభాయి ఎంతో మందికి విద్యను అందించిన విద్యాదాత అని శ్రీ చైతన్య విద్యాసంస్థల ఛైర్మన్ రమణయ్య తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డులోని శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో ఛైర్‌పర్సన్ ఝాన్సీలక్ష్మీభాయి 76వ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యాసంస్థలు స్థాపించి ఎందరికో విద్యాబుద్ధులు నేర్పించి ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజనీర్లను తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. విద్యాసంస్థల్లో రక్తదానం ఏర్పాటు చేసి 60 మందికిపైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో రిమ్స్ డాక్టర్ రాజేంద్ర, విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు
శ్లోకాశ్రీ, రమ్యశ్రీలు ఎంపిక

ముగిసిన ఎస్‌జీఎఫ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు



బ్యాడ్మింటన్ జాతీయజట్టుకు ఎంపికైన బాలబాలికలు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జికారోనేషన్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. బుధవారం బాలబాలికలకు వ్యక్తిగత విభాగంలో పోటీలు నిర్వహించి ఐదుగురు క్రీడాకారులను జాతీయజట్టుకు ఎంపిక చేశారు. బాలికల విభాగంలో కడపజిల్లా నుంచి ఇద్దరు బాలికలు శ్లోకాశ్రీ, రమ్యశ్రీలు జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 17వ తేదీ నుంచి మధ్యప్రదేశ్‌లో జరుగనున్న జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు.గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, జ్ఞాపికలను అందజేశారు. జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులను బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారద, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరి జిలానీబాషా, అబ్జర్వర్ శ్రీనివాసరావు, అరుణ, విజయప్రసాద్‌రెడ్డిలు అభినందించారు.
జాతీయ జట్టుకు ఎంపికైన బాలుర జట్టు : చరణ్‌రామ్, ప్రవణ్‌సాయి (చిత్తూరు), పార్థీవ్ (వైజాగ్), తరుణ్ (కర్నూలు), తిలోక్ (పశ్చిమ గోదావరి).
బాలికల జట్టు : శ్రావణి (వైజాగ్), భవితశ్రీ (కర్నూలు), శ్లోకాశ్రీ, రమ్యశ్రీ (కడప), లహరి (వైజాగ్).

ఖోఖో పోటీలకు పోట్లదుర్తి విద్యార్థులు



ఎర్రగుంట్ల, నవంబరు 6: మండల పరిధిలోని పోట్ల దుర్తి విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడల్లో మంచి ప్రతిభను కనపరచి జాతీయస్థాయి జట్టుకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. నవం బరు 2 నుంచి 4 వరకు అనకాపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ 17 బాలబాలికల ఖోఖో పోటీల్లో పోట్లదుర్తి విద్యార్థులు జిల్లా స్థాయి జట్టుకు ప్రాతినిత్యం వహించి మంచి ప్రతిభ కనపరచినట్లు తెలిపారు. ఇందులో ఖోఖోలో పదవ తరగతి విద్యార్థిని దేవి జాతీయ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈమె ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో డిసెంబర్ 5 నుంచి 8వరకు జరిగే పోటీల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. అలాగే రాయచోటిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో పోట్లదుర్తి విద్యార్థి హర్షవర్ధన్ ఎంపిక అయ్యారు. మహారాష్ట్రలో డిసెంబర్‌లో నిర్వహించే యోగాసన పోటీల్లో పాల్గొంటారు. వీరిని హెచ్‌ఎం పద్మనాభరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు బి.లక్ష్మి,సెస్సితబితారాణిలు, ఉపాధ్యాయులు అభినందించారు.

టెన్నికాయిట్‌లో రాష్ట్రస్థాయికి మానస



కడప స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టెన్నికాయిట్ అండర్-14 క్రీడాపోటీల్లో వీరబల్లి కేజీబీవీ విద్యార్థిని ఎం.మానస అత్యున్నత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీఈటీ సి.పార్వతి వెల్లడించారు. స్థానిక మునిసిపల్ ఉర్దూ స్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి అండర్-14 క్రీడాపోటీల్లో ఎం.మానస అత్యున్నత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. మానస త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి తద్వారా జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు : జేసీ



గండికోట నిర్వాసితులతో మాట్లాడుతున్న జేసీ అదితిసింగ్

కొండాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గండికోట పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోనున్నట్లు జాయింట్‌కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. బుధవారం సాయింత్రం కడపలోని తన చాంబర్‌లో గండికోట నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా పునరావాస కాలనీల్లో గత ప్రభుత్వం హయంలో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీలు శ్మశానవాటికలు వంటి మౌలిక సదుపాయాలు అసంపూర్తిగా ఉన్నాయని నిర్వాసితులు జేసీకి వివరించారు. ఎంతమేరకు పనులు చేపట్టారు, అసంపూర్తిగా ఉన్న వాటికి ఎంత నిధులు అవసరమవుతయో తెలపాలని పక్కనే ఉన్న ఇంజనీరింగ్ అధికారులను జేసీ ఆదేశించారు. పునరావాస పరిహారం కింద మొదటివిడత 14 ముంపు గ్రామాలకు అదనపు పరిహారం రూ.3,25,000తోపాటు అన్ని గ్రామాలకు గత ప్రభుత్వం పరిహారం కింద విడుదల చేసిన జీవోకు వెంటనే పరిహారాన్ని ఇప్పించాలని నిర్వాసితులు కోరారు. కొండాపురంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ముంపునకు గురైన జడ్పీ హైస్కూల్ స్థానంలో కొత్త స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మాజీసర్పంచ్ విశ్వ నాథరెడ్డి, ఎంపీటీసీ భర్త బాబురెడ్డి తదితరులు జేసీని కోరారు. ముంపునకు గురైన అన్ని గ్రామాల నుంచి జేసీ నిర్వాతులతో వివరాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దార్ గురప్ప, ఇంజనీరింగ్, ఇరిగేషన్ అధికారులు నిర్వాసితులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు



సింహాద్రిపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అంకాళమ్మగూడూరు గ్రామ సమీపాన ఓ రేకుల షెడ్డులో స్టాక్ పాయింట్‌గా చేసుకుని ఇతర ప్రాంతాలకు తరలించే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సింహాద్రిపురం ఎస్ఐ మహమ్మద్ షరీఫ్ తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు.. సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలానికి చెందిన తుమ్మల మిత్రమనాయుడు చుట్టుపక్కల మండలాల నుంచి రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక లాభాలు పొందేందుకు ఇతర ప్రాంతాలకు తరలించేవాడు. ఈనేపధ్యంలో కడప రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కడప విజిలెన్స్ అధికారులు పులివెందుల సీఎస్‌డీటోలతో కలిసి దాడులు నిర్వహించారు. 105 బస్తాలలో రూ.1,57,839లు విలువ గల 3469 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మిత్రమ నాయుడును పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. విజిలెన్స్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్థల విషయమై దౌర్జన్యం

దువ్వూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని ఇందిరమ్మ కాలనీలో స్థలం విషయమై ముగ్గురు వ్యక్తులు మరో వ్యక్తిపై దాడికి పాల్పడ్డారని స్థానిక పోలీసులు తెలిపారు. శేఖర్ అనే వ్యక్తికి సంబంధించిన రెండు సెంట్ల స్థలాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలని కందుల గిరి, ఎం.సురేష్, ఎం.సురేంద్ర దౌర్జన్యానికి పాల్పడి దాడి చేశారని తెలిపారు. ఖాళీ చేయించే వ్యవహారం అయిదేళ్లుగా కొనసాగుతోందని చెప్పారు. దారి వెంట వెళుతున్న శేఖర్‌పై దాడికి పాల్పడ్డారని, బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో 15 గొర్రెలు మృతి



విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన గొర్రెలు

చక్రాయపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరుపల్లె గ్రామ సమీపంలో విద్యుత్ షాక్‌కు గురై 15 గొర్రెలు మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. కల్లూరుపల్లె సమీపంలో మేతకోసం మేకలను తోలుకొని వెళ్తుండగా రోడ్డుపై విద్యుత్ వైరు తెగిపడింది. దీంతో ఆ ప్రాం తంలో గొర్రెలు వెళ్లగా విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడ్డాయి. గొర్రెల కాపరి నరసింహనాయుడుకు కూడా విద్యుత్ షాక్ తగలడంతో మూర్ఛిల్లిపోయాడు. గొర్రెలు మృతి చెందడతో దాదాపు రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని గొర్ల యజమాని బంధువులు తెలిపారు. అలాగే గొర్రెలకు పశువైద్యాధికారి పోస్టు మార్టం నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో కత్తితో దాడి ఇరువురికి గాయాలు

పులివెందుల టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అచ్చువెల్లి గ్రామ పంచాయతీ కానేపల్లె గ్రామంలో కుటుంబకలహాలతో గంగనపల్లె బాషా కత్తితో దాడికి పాల్పడ్డ సంఘటనలో బండి సూరి వీరయ్య, ఉడవ గండ్ల బాషాలకు గాయాలయ్యాయి. వివరాలిలా.. బండిసూరి వీరయ్య కొడుకు దస్తగిరి అదే గ్రామంలో ఉండే గంగనపల్లె బాషా కుమార్తెను వివాహం చేసుకున్నాడు. అయితే వారిరువురు మధ్య విభేధాలు రావడంతో దస్తగిరి తన భార్యతో విడాకులు కావాలంటూ కోర్టు ద్వారా నోటీసులు పంపారు. దీంతో ఇరు కుటుంబాల మధ్య విభేధాలు వచ్చాయి. మంగళవారం రాత్రి బండి వీరయ్య తన బంధువైన ఉడవగండ్ల బాషాతో కలిసి గంగనపల్లె బాషా ఇంటి వద్దకు వెళ్లి ఘర్షణకు దిగాడు. దీంతో గంగనపల్లె బాష ఇంటిలో ఉన్న కత్తి తీసుకుని బండి సూరి వీరయ్యను అతనితో వచ్చిన బాషాపై కత్తితో పొడవడంతో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స కోసం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారని.. బాధితుల ఫిర్యాదు మేరకు గంగనపల్లె బాషాపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అయ్యవార్లు... ఇది మీకు తగునా...?

- ఒకేరోజు ఇరువురు ఉపాధ్యాయులు గైర్హాజరు



ఉపాధ్యాయుల గైర్హాజరుతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కాశినాయన, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఇరువురు ఉపాధ్యాయుల తీరు మారూటే సవరేటు అన్నట్లుంది. ఒకవైపు ప్రభుత్వం సర్కారు బడుల బలోపేతానికి చర్యలు చేపడుతుంటే అలాంటివి మాకు వర్తించవు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. బుధవారం ఇద్దరు ఉపాధ్యాయులు గైర్హాజరయ్యారు. ఉదయం 11గంటలు అవుతున్నా ప్రధానోపాధ్యాయుడు ఓ.బాలశోభన్‌కుమార్, మరో ఉపాధ్యాయుడు వెంకట్రామయ్య పాఠశాలకు చేరుకోలేదు. ఒకవైపు అదేరోజు సెల్ఫ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఉదయం నర్సాపురం ఎమ్మార్సీ కార్యాలయానికి వెళ్లి ప్రశ్నపత్రాలు తెచ్చుకొని ఉదయం 9.30 గంటలకు పరీక్షను ప్రారంభించాలి. అవేవి పట్టించుకోకుండా ఇరువురు ఉపాధ్యాయులు బడికి ఎగనామం పెట్టారు. ఈవిషయం ఆలస్యంగా తెలుసుకున్న సంబంధిత అధికారి ఉదయం 11.30 గంటలకు సీఆర్పీని పంపి మమ అన్నట్లు పరీక్ష నిర్వహిం చారు. ఇక్కడి అయ్యవార్లు గత కొంతకాలంగా విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని.. సమయపాలన పాటించడం లేదని పలుమార్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదంటున్నారు స్థానికులు. పాఠశాల సీఆర్పీ రవి కూడా ఈఇద్దరు ఉపాధ్యాయుల తీరుపై పలుమార్లు ఎంఈవో దృష్టికి తీసుకు పోయినట్లు సమాచారం. ఇరువురు ఉపాధ్యాయుల మధ్య సఖ్య త కొరవడి.. ఒకరిపై ఒకరు పోటీపడి బడికి గైర్హాజరవుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వర్తించేలా చర్యలు తీసు కోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈవిషయంపై ఎంఈవో2 ఓ.ప్రమీళను వివరణ కోరగా తనకు ముందస్తు సమాచారం లేదని.. విషయం తెలుసుకొని 11 గంటల తర్వాత సీఆర్పీని అక్కడికి పంపించానన్నారు. ఇరువురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ తీసుకొని ఉన్నతాధికారులకు తెలిజేస్తామన్నారు.

రైతుల ఆనందమే టీడీపీ ధ్యేయం

ప్రతి ఎకరాకు నీటిని అందజేస్తా ● కొప్పోలు చెరువు నుంచి నీటిని విడుదల చేసిన పుత్తా

వల్లూరు, నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి): రైతులు దేశానికి వెన్నెముకలాంటివాడని, రైతు అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి అన్నారు. కొప్పోలు చెరువు నుంచి ఆయకట్టు కాల్వలకు బుధవారం అధికారులతో కలిసి నీరు విడుదల చేసిన ఆయన మాట్లాడుతూ చెరువుల్లో నీరు పొలాలకు ఉపయోగపడతాయన్నారు. ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టినప్పటి నుంచీ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రతి ఎకరాకు నీరు అందిస్తామన్నారు. ఈఈ వెంకటరామయ్య, డీఈ జగదీశ్వర్‌రెడ్డి, డీఈ శేషబాబు, ఏఈ శంకరయ్య, ఎమ్మార్వో శ్రీవాణి, టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ జయసుబ్బారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, ఓబుల్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, విజయరెడ్డి, ధర్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి, శివారెడ్డి, బాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


నీటిని విడుదల చేస్తున్న పుత్తా నరసింహారెడ్డి, అధికారులు, రైతులు

'రీసర్వేతో రైతులకు అన్నీ కష్టాలే'

కమలాపురం రూరల్, నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి): వైసీపీ ప్రభుత్వం అవగాహన రాహిత్యంగా చేసిన రీసర్వేలో రైతులకు అన్నీ కష్టాలే మిగిలాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. బుధవారం దేవరాజుపల్లెలో నిర్వహించిన రీసర్వే సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రీసర్వే పేరుతో రైతులను కష్టాల పాలు చేసిందన్నారు. రీసర్వే సమస్యలను రెవెన్యూ సదస్సులు గ్రామసభలో పరిష్కరించాలని అధికారుల దృష్టికి తెచ్చారు. తహసీల్దారు శివరాంరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు శ్రీకాంత్, వీఆర్వోలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం కోరుతూ ధర్నా

ముగ్గురిపై కేసులు నమోదు చేయాలి ● వికలాంగుల హక్కుల పోరాట సమితి డిమాండ్

చెన్నూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడు బచ్చు సురేశ్‌బాబుకు తీరని అన్యాయం చేసిన కొండపేట వాసి మంజుల, ఆమె భర్త శివరామిరెడ్డి అన్న విజయభాస్కర్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అన్నం సుబ్బయ్య యాదవ్ డిమాండ్ చేశారు. చెన్నూరు పోలీసుస్టేషన్ ఎదుట బుధవారం ఎమ్మార్పీఎస్‌తో కలిసి ధర్నా చేపట్టిన వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ సురేశ్‌బాబు ప్రస్తుతం మైదుకూరు మండలం గుడ్డివీరయ్య సత్రం వద్ద జీవిస్తున్నారన్నారు. ఇతని ఇంటిని కొండపేట గ్రామంలో మంజుల కుటుంబానికి నాలుగున్నర లక్షలకు అమ్మి రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. అయితే ఇంటి సమస్య కోర్టులో ఉందని ముందే తెలపడంతో కోర్టు సమస్య తీరగానే మిగిలిన లక్ష రూపాయలు ఇస్తామని మంజుల కుటుంబం చెప్పారన్నారు. కొద్దిరోజుల తరువాత మంజుల కుటుంబం సురేశ్‌బాబును పిలిచి మీ ఇల్లు తిరిగి మీకు ఇచ్చేస్తాం, మేం ఇచ్చిన సొమ్ము వెనక్కు ఇవ్వమని నమ్మబలికి కడప రిజిస్టరు కార్యాలయం వద్ద సురేశ్‌బాబు నుంచి మంజుల కుటుంబం నాలుగున్నర లక్షలు డబ్బు తీసుకున్నారన్నారు. డబ్బు తీసుకున్న మంజుల కుటుంబం సురేశ్‌బాబుకు ఇంటిని తిరిగి రిజిస్టరు చేసి ఇవ్వకుండా వెళ్లారు. ఈ విషయమై పలుమార్లు ఇల్లు ఇవ్వమని కోరినా ఇవ్వకపోగా ఇటీవల ఇంటి వద్దకు వెళ్లిన సురేశ్‌బాబును ఇబ్బంది పెట్టడం అసభ్యపదజాలంతో దూషించారని తెలిపారు. దీంతో దివ్యాంగునికి జరిగిన అన్యాయం పై ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. పైగా సురేశ్‌బాబుకు ఇల్లు తిరిగి ఇవ్వడం, అతన్ని ఇబ్బంది పెట్టి దూషించిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వారి డిమాండ్లపై సీఐకి వినతిపత్రం ఇచ్చారు. దీంతో సీఐ మాట్లాడుతూ ప్రస్తుతం సురేశ్‌బాబు చెప్పిన మేరకు మంజులపై కేసు నమోదు చేశా మని, మిగిలిన ఆమె భర్త సోదరుడు విజయభాస్కర రెడ్డిపై కూడా విచారణ చేయిస్తామన్నారు. శనివారం రావాలని వీహెచ్‌పీఎస్ సభ్యులకు, దివ్యాంగునికి చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు మాతయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మానికింది వెంకటేశ్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ రాజు, ఆంజనేయులు, నగర అధ్యక్షులు ప్రసాద్, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరసింహులు, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి లలిత, సుబ్బరాయుడు, గురవయ్య, ఓబయ్య , ఎరుకలయ్య ఆరిఫుల్లా, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


పోలీసు స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న వీహెచ్‌పీఎస్ ఎమ్మార్పీఎస్ నేతలు

శ్రీనివాస కళాశాలలో మెడికల్ క్యాంపు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉక్కాయపల్లె శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం డాక్టర్ వై.శివకుమార్ ఆధ్వర్యంలో కాస్మటిక్ ప్లాస్టిక్ సర్జరీ సంబంధించిన వైద్యశిబిరం నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాసులు శిబిరాన్ని ప్రారంభిస్తూ విద్యార్థులకు ఆరోగ్య సలహాలు, వైద్యనిపుణుల ద్వారా పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకే ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. డాక్టర్. వై.శివకుమార్ శిబిరంలో వైద్యసేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.నాగరాజ, ప్రముఖ దంత వైద్యులు దీపక్ మౌళీనాథ్, డాక్టర్ మౌళాలి పాల్గొన్నారు.


వైద్యశిబిరం ప్రారంభిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాసులు

టీడీపీ ఎన్‌ఆర్‌ఐ కార్యాలయం ఏర్పాటు హర్షణీయం

పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి): గల్ఫ్‌దేశాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని వారికి అండగా నిలబడి సేవలు అందించేందుకు టీడీపీ ఎన్‌ఆర్‌ఐ కార్యాలయం ఏర్పాటు చేయడం హర్షణీయమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి తెలిపారు. మాసాపేటలో టీడీపీ ఎన్‌ఆర్‌ఐ కార్యాలయాన్ని ప్రారంభించిన వారు మాట్లాడుతూ జిల్లా నుంచి అనేక మంది బతుకు దెరువు కోసం గల్ఫ్‌దేశాలకు వెళ్లారన్నారు. అక్కడ వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కార్యాలయం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. టీడీపీ నేతలు ఎస్.గోవర్ధనరెడ్డి, దుర్గాప్ర సాద్, క్రీసెంట్ జిలానీ, మాసాపేట శివ, శంకర్, జయకుమార్ పాల్గొన్నారు.


ఎన్‌ఆర్‌ఐ కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి

జోన్ పురోగతికి బాటలు : కడప జోన్ ఈడీ

కడప మారుతీనగర్ నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కింది స్థాయి ఉద్యోగులతో సమీక్షించి కడప జోన్-4 పురోగతికి బాటలు వేస్తామని ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్ వెల్లడించారు. ఆర్టీసీ ప్రధాన కార్యాలయం (విజయవాడ)లో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై కడప జోన్ ఈడీగా బుధవారం ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయ భవన సముదాయంలోని ఈడీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలోనే కడప జోన్ సుమారు 52 డిపోలతో చాలా పెద్ద జోన్‌గా వుందన్నారు. ఆ లెక్కన 40 శాతం డిపోలు, 42శాతం బస్సులు కడప జోన్‌లోనే వున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహా రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న సొంత నియోజకవర్గాలు కడప జోన్‌లోనే వున్నాయన్నారు. కడప జోన్‌ను మంచి ఫలితాలు వచ్చేలా ముందుకు తీసుకెళ్తామన్నారు.

గెలుపోటములు సహజం

పులివెందుల టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవితంలో గెలుపోటములు సమాన మని, అన్నింటినీ స్వీకరిస్తూ పాల్గొనడమే ముఖ్యమని ఆర్డీఓ కుమారి భానుశ్రీ అన్నారు. డాక్టర్ వైఎస్‌ఆర్ క్రీడా ప్రాంగణలో జిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17, 19 బాలుర విభాగంలో సాఫ్ట్ టెన్నిస్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో విశిష్ట అతిధి, స్కూలుగేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి అరుణకుమారి, అబ్జర్వర్ రవికుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, డీవీ కొం డారెడ్డి మాట్లాడారు. వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విజేతలతో ఆర్డీఓ భానుశ్రీ, నిర్వాహకులు

జేఎన్టీయూ ప్రిన్సిపాల్‌గా విష్ణువర్ధన్

పులివెందుల రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ డి.విష్ణువర్ధన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపాల్ అరుణకాంతి అనంతపురం జేఎన్టీయూకు బదిలీ అయ్యారు. ప్రిన్సిపాల్‌కు అనంతపురం జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శన్‌రావు, డైరెక్టర్ ప్రొఫెసర్ భానుమూర్తి, పులివెందుల జేఎన్టీయూ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శేషమహేశ్వరమ్మ, అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.


ప్రిన్సిపాల్ డి.విష్ణువర్ధన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వీసీ, డైరెక్టర్

వరి, మినుములో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

వీరపునాయునిపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరి, మినుము పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ శ్యామ్‌బాబు అన్నారు. యు.రాజుపాలెంలో బుధవారం నిర్వహించిన పొలంపిలుస్తోందిలో వరిలో కాండం తొలుచు పురుగు, ఆకునల్లి, పాముపొడ తెగులు, మినుములో పల్లాకు తెగులు, రసంపీల్చే పురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. రైతు సేవా కేంద్రం సహాయకులు గంగయ్య, రైతులు పాల్గొన్నారు.

మీరాపురంలో....

కమలాపురం రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి సూచించారు. బుధవారం మీరాపురం, పుట్లంపల్లె పొలాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. పొట్టదశలో వరి పొలాన్ని సందర్శించినప్పుడు ఆకుముడత పురుగును గమనించినట్లు తెలిపారు. ఇందుకు నివారణ చర్యలను రైతులకు సూచించారు. నవంబరు 15 నుంచి డిసెంబరు 15 వరకు వరి నాట్లకు అనుకూలమన్నారు. ఏఓ సరస్వతి, వ్యవసాయ సహాయకులు దస్తగిరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను శిక్షించవద్దు : ఆపస్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ యుగంలో కూడా రెసిడెన్షియల్ శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను నిర్బంద శిక్షణతో శిక్షించవద్దని ఆపస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, డి.కొండారెడ్డి డిమాండ్ చేశారు. ఆపస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇపటికే ఉపాధ్యాయులు అనేక యాప్‌ల నిర్వహణ ద్వారా పని భారం తీవ్ర వత్తిడికి గురవుతున్నారన్నారు. మళ్లీ ఇటువంటి వత్తిడికి గురిచేయకూడదని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు వెంకట్రామి రెడ్డి, జిల్లా నాయకులు రెడ్డయ్య పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్యనేతల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, మహేశ్‌బాబు మాట్లాడారు. శిక్షణ తరగతులు రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజు, అబ్దుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై వత్తిడితో ప్రభుత్వం లక్ష్యం చేరుకోలేమని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల గంగిరెడ్డి తెలిపారు. ప్రభుత్వం దీన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

శిల్పారామం, ఉలిమెల్ల లేక్ సందర్శించిన సీఈఓ

పులివెందుల టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శిల్పారామం, ఉలిమెల్ల లేక్‌ని రాష్ట్ర శిల్పారామం నూతన సీఈఓ వి.స్వామినాయుడు సందర్శించారు. శిల్పారామం కార్యాలయంలో ఏఓ సుధాకర్, కార్యాలయ సిబ్బంది, ఫీల్డ్ సిబ్బందితో పలు అంశాలపై మాట్లాడారు. శిల్పారామం, ఉలిమెల్ల లేక్ అభివృద్ధికి అవసరమైన అనుమతుల కోసం నివేదికలు ఇవ్వాలని సూచించారు. బోటింగ్ పాండ్‌లో షికారు చేసే వారు లైఫ్‌జాకెట్లు ధరించేలా చూడాలన్నారు. శిల్పారామం ఏఈ వెంకటసుబ్బయ్య, ఫీల్డ్ సూపర్‌వైజర్లు ఇస్మాయిల్, సుబ్బారావు, వరప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నామమాత్రంగా మండల సమావేశం

పెండ్లిమర్రి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఒకసారి మండల అభివృద్ధి సమావేశం నామమాత్రంగా నిర్వహించారు. చేయాల్సిన పనులపై ప్రజా ప్రతినిధులు, మడలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి చర్చిస్తారు. అయితే బుధవారం జరిగిన మండల సమావేశం నామమాత్రంగా ముగించారు. ఎంపీడీఓ మండలస్థాయి అధికారులకు కూడా సమాచారం ఇవ్వలేదని కొన్ని శాఖల అధికారులు తెలిపారు. మండల సమావేశానికి ఆయా శాఖల అధికారులకు సమాచారం పంపాలి. ఇక్కడ మాత్రం అలాంటివి ఏమీ జరగలేదు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మెన్ బాలయ్య, ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచులు, తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయాధికారి ఓబులేసు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రహదారులను అభివృద్ధిపరచండి

కేంద్ర మంత్రికి ఎంపీ లేఖ

పులివెందుల, నవంబరు 6: జిల్లాలోని పలు రహదారులను అభివృద్ధి పరచాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ జైరాం గడ్కరీకి లేఖ రాశారు. రేణిగుంట-ముద్దనూరు రోడ్డు అత్యత ముఖ్యమైన జాతీయరహదారి అన్నారు. కోడూరు, రాజంపేట, కడప, కమలాపురం, యర్రగుంట్ల, చిలమకూరు, ముద్దనూరు తదితర ముఖ్యమైన పారిశ్రామిక, వాణిజ్య పట్టణాల గుండా వెళ్తుందన్నారు. ప్రస్తుతం రెండు లేన్ల రహదారిపై ట్రాఫిక్ తీవ్రత చాలా ఎక్కువగా ఉందన్నారు. దీంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. కావున ప్రాముఖ్యతను గుర్తించి నాలుగు వరుసల రహదారిని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

కలెక్టరేట్‌ను పరిశీలించిన కలెక్టర్

కడప కలెక్టరేట్ నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ శ్రీధర్ చెరుకూరి కలెక్టరేట్‌లోని అన్ని విభాగాలు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలసి పరిశీలించారు. కంట్రోల్ రూమ్, ఎన్‌ఐసీ సెంటర్, జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్, పీజీఆర్ఎస్ హాలు, బోర్డు మీటింగ్ హాలు, వీసీహాలు, అన్ని సెక్షన్ల కార్యాలయాలను పరిశీలించారు.


కలెక్టరేట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్

కలెక్టరును కలిసిన టీడీపీ నేతలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టరుగా బాధ్యతలు చేపట్టిన చెరుకూరి శ్రీధర్‌కు టీడీపీ నేతలు ఎస్.గోవర్ధనరెడ్డి, అమీర్‌బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టరును సత్కరించారు. టీడీపీ నేతలు గురప్ప, వెంకటేశ్, సుధాకర్‌యాదవ్, శ్రీను, రామ్, గంగిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నేతలు

కడప కలెక్టరేట్ నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న డాక్టర్ శ్రీధర్‌ను కలెక్టరేట్ ఆయన చాంబర్లలో ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య కలిశారు. ఆయన ఆధ్వర్యంలో ఆ సంఘ నేతలు, సభ్యులు పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వేలో నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్ నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైల్వేలో విశ్రాంత ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవాలన్న నిర్ణయాన్ని ఉప సంహరించు కోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కడప రైల్వే డిప్యూటీ స్టేషన్ మేనేజరుకు వినతిపత్రం అందించిన వారు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేనంత యువశక్తి ఉన్నా ఉపాధి కల్పనలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 9.8లక్షల ఉద్యోగాల పోస్టులన్నింటినీ నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. నగర కన్వీనరు విజయ్, జిల్లా సహాయ కార్యదర్శి అంజి, నగర నేతలు పాల్గొన్నారు.


డిప్యూటీ స్టేషన్ మేనేజరుకు వినతిపత్రం అందిస్తున్న డీవైఎఫ్ఐ

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

మెడికల్ ఆర్డీకి ఎన్జీవో సంఘం నేతల వినతి

కడప కలెక్టరేట్ నవంబరు6 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధి వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కడప మెడికల్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్యకు బుధవారం ఏపీ ఎన్జీవో సంఘ అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, కర్నూలు జిల్లా అధ్యక్షుడు సి.హెచ్ వెంగల్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. నర్సింగ్ సూపరింటెండెంట్, ఫార్మశిస్టుల పదోన్నతులు త్వరగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా నేతలు బాలపుల్లయ్య, నిత్య పూజయ్య, సిటీ అధ్యక్షుడు చిన్నయ్య, పద్మనాభం, రామసుబ్బారెడ్డి, మహిళా నాయకురాళ్లు గౌరి, జ్యోతి పద్మజ, వెంకటలక్ష్మీ ప్రమీలారాణి, కుసుమ కుమారీ, కర్నూలు ఫార్మశీ నేతలు పాల్గొన్నారు.

వేడుకగా నాగపంచమి


తెల్లవారుజామునే మల్లేశ్వరాలయం వద్ద భక్తుల సందడి

చెన్నూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో నాగపంచమిని ప్రజలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. తెల్లవారుజాము నుంచే స్థానిక మల్లేశ్వరాలయంలో మహిళలు, కుటుంబ సభ్యులు పెద్దఎత్తున ఆలయానికి తరలివచ్చారు. మూలవిరాట్‌మూర్తికి అభిషేకాలు, నాగులకు అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. నాగేశ్వరుడు సంతానం లేని కుటుంబాలకు సంతానం అందించే గొప్ప ఇలవేల్పు అని అలాంటి మహనీయున్ని నాగపంచమి రోజు పూజిస్తే ఆ కుటుంబానికి శుభాలు కలుగుతాయన్నారు.

పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలకు 40 బస్తాల బియ్యం వితరణ

కడప కల్చరల్ నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రతిష్టాత్మకంగా కడపలో జరుగనున్న పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్. గోవర్ధన్‌రెడ్డి 40 బియ్యం ప్యాకెట్లను బహూకరించారు. దేశవ్యాప్తంగా తరలివచ్చే భక్తులకు భోజనసౌకర్యం కల్పించేందుకు వీలుగా పెద్దదర్గా ప్రతినిధులు అమీర్‌కు బియ్యం బస్తాలను అందజేశారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ దర్గాలో జరిగే అన్నదానానికి తన వంతుగా కొన్నేళ్లగా బియ్యం ప్యాకెట్లను అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ మాజీ న్యాయవాది గుర్రప్ప, టీడీపీ నేతలు గడ్డం శ్రీనివాసులు, సుధాకర్‌యాదవ్, ఎ. వెంకటేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.


బియ్యం ప్యాకెట్లను అందిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు గంగనపల్లె విద్యార్థులు

పెండ్లిమర్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంగనపల్లె హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సావిత్రిదేవి తెలిపారు. మంగళవారం కడప ఉర్దూ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన బాలభాస్కర్, రెడ్డయ్య, ఖలీల్, సుష్మ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు శివశకర్‌రెడ్డి అభినందించారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సికెదిన్నె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అలీ, వైద్యాధికారులకు వినతి పత్రం అందించారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట కమిటీ పిలుపు మేరకు బుధవారం చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ సునీతకు సమస్యలపట్ల వినతి పత్రం అందించారు. మూడు నెలలుగా జీతాలు అందక కుటుంబాలు పోషించుకోవడం కష్టంగా ఉందని వాపోయారు.

గులాబి రంగు పురుగు నివారణతో అధిక దిగుబడి

వేముల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటలో గులాబీ రంగుపురుగు నివారణతోనే అధిక దిగుబడి సాధించవచ్చని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ అన్నారు. బుధవారం గొల్లలగూడూరు, పెర్నపాడు, నల్లచెరువుపల్లె గ్రామాల్లో పత్తి పంటను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ పత్తిపంట వేసిన 60 రోజుల నుంచి పంటలో కాయతొలిచే పురుగు ముఖ్యంగా గులాబీ రంగు పురుగు రాకమునుపే ముందస్తు చర్యలు తీసుకోవాల న్నారు. వేపనూనె కషాయం, లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పురుగు ఆశించినపుడు వాడాల్సిన మదులను సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి నాగభూషణ్‌రెడ్డి, ఏఓ చెన్నారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాలామృతంతో పిల్లల్లో ఎదుగుదల

● సీడీపీవో రాజేశ్వరీదేవి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరిదేవి

జమ్మలమడుగు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి తల్లి పిల్లలకు బాలామృతం క్రమం తప్పకుండా అందించాలని ఇది పిల్లల్లో ఎదుగుదలకు ఎంతో సహాయ పడుతుందని జమ్మలమడుగు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో రాజేశ్వరిదేవి, సూపర్‌వైజర్ గౌషియా సూచించారు. బుధవారం జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ప్రొద్దుటూరు రోడ్డులో దుత్తలూరునగర్ అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్త ముంతాజ్‌బేగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఐసీడీఎస్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా తల్లులు, పిల్లలకు, గర్భిణులకు ఆహారపు అలవాట్లపై వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు నాగలక్ష్మి , తల్లులు, పిల్లలు, ఐసీడీఎస్ అధికారులు, అంగన్వాడీ టీచర్ ముంతాజ్ బేగం పాల్గొన్నారు.

10న డ్రాయింగ్ పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాలోత్సవంలో భాగంగా ఈనెల 10వ తేదీన డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డి.వి.రవీంద్రుడు తెలిపారు. బుధవారం హోమస్‌పేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హోమస్‌పేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు డ్రాయింగ్ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలకు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, ముద్దనూరు, చాపాడు, దువ్వూరు మండలాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు హాజరు కావచ్చునని తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనాలని, పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు డ్రాయింగ్ షీట్ ఇస్తామని పేర్కొన్నారు. పెన్సిళ్లు, రంగులను తెచ్చుకోవాలని రెండు గంటల సమయంలో విద్యార్థులు వారికి నచ్చిన చిత్రాన్ని వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుందరం, నాగరాజు, అరుణ, లక్ష్మీదేవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు పారేదెలా..?

● నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు ● దోమలతో స్థానికుల ఇక్కట్లు
● ఇంటి నుంచి పిల్లలు బయటకు వెళ్లాలన్నా భయం భయం ● దుస్థితిలో మోరగుడి

జమ్మలమడుగు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మురుగు పారని మోరగుడిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాడిపత్రి రోడ్డులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎదురుగా డ్రైనేజీ కాలువ అధ్వానంగా మారి మురుగునీరు కంపుకొడుతోందని స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోడ్ల కూడలి వద్ద నుంచి రచ్చబండ వరకు ప్రధాన రోడ్డు పక్కనే అధికారులంతా ఏదో ఒక సమయంలో వెళుతుంటారు. ఇంత దారుణంగా డ్రైనేజీ కాలువ వ్యర్థాలునిండి కంపుకొడుతున్నా కనిపించడంలేదా అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఎదురుగా ఇంటి సమీపాన స్థానికులు వారి వారి పిల్లలను బయటకు పంపాలన్నా, కాలువ దాటుకుని వెళ్లే వారికి చాలా ఇబ్బందికరంగా మారింది. పిల్లలను బయటకు పంపాలన్నా కాలువలో పడి ప్రమాదం జరుగుతుందేమోనని ఆందోళన చెందుతున్నట్లు స్థానికులు వాపోయారు. వ్యర్థాలు కంపు కొడుతుండడం వలన దోమలు విజృంభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోరగుడిలో గత నెలలో భారీవర్షం కురిస్తే తుఫాను వలన కొందరు చేనేత కార్మికుల మగ్గపు గుంతల్లో నీరు చేరినా అధికారులు ఎవరూ పట్టించుకోలేదని వాపోతున్నారు. దుర్గంధంతో స్థానికంగా ఉండి భరించలేని కంపుతో ఇబ్బంది పడుతున్నట్లు వాపోయారు. కూటమి ప్రభుత్వంలోనైనా డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


మోరగుడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎదురుగా డ్రైనేజీ కాలువ


మోరగుడి ప్రధాన రోడ్డు పక్కన కాలువలో నిండిన వ్యర్థాలు

పాడిపశువులకు మెరుగైన వైద్యసేవలు

పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఆర్.ధనుంజయరెడ్డి



ముఖాముఖి

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పశుసంపద దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత ప్రాధాన్యమైంది. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు లాంటివి రైతులకు జీవనోపాధినిచ్చే వనరులు. రైతులు ఎప్పటికప్పుడు పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలను సద్వినియోగం చేసుకోవాలంటున్న పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఆర్.ధనుంజయరెడ్డితో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రశ్న: పశువైద్యుల కొరతతో పాడి రైతులకు సకాలంలో సేవలు అందడంలేదు కదా.?

జవాబు: ప్రొద్దుటూరు ఏరియా వెటర్నరీ ఆస్పత్రి పరిధిలోని కామనూరు, చౌడూరు ఆస్పత్రులలో వైద్యులు లేరు. సమస్యను అధిగమించడానికి బుడ్డాయపల్లె, తాళ్లమాపురం వెటర్నరీ డిస్పెన్సరీస్‌లోని వైద్యులను ఇన్‌చార్జీలుగా నియమించి రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న: మీ పరిధిలో భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి కదా. మరి ప్రతిపాదనలు పంపారా.

జవాబు: ఏవీహెచ్ పరిధిలో మొత్తం 6 వీడీ ఆస్పత్రులలో ఒక దువ్వూరులోని భవనం పాడుబడింది. 1968లో నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. నూతన భవనం కోసం రూ.36 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం. గతంలో డీఆర్‌జీఎఫ్, ప్రస్తుతం ఆర్ఐడీఎఫ్ నిధులను కోరుతూ పలుమార్లు ప్రతిపాదించాం. నిధులు మంజూరుకాగానే నూతన భవనం అందుబాటులోకి వస్తుంది.

ప్రశ్న: పశుగణన ఎప్పటిలోగా పూర్తి చేస్తారు.

జవాబు: 20వ పశుగణన లెక్కల ప్రకారం ప్రొద్దుటూరు మండలంలో 14,750 నల్లజాతి పశువులు (గేదెలు), 1403 ఆవులు, 25,201 గొర్రెలు, 6033 మేకలు, 24,376 కోళ్లు ఉన్నాయి. దువ్వూరు మండలంలో 12,741 గేదెలు, 1754 ఆవులు, 22,355 గొర్రెలు, 6249 మేకలు, 25,762 కోళ్లు ఉన్నాయి. 21వ పశుగణన ప్రారంభమైంది. ఫిబ్రవరి చివరినాటికి ఈ గణను పూర్తి చేస్తాం. రైతులు, పెంపకందారులు తమ సిబ్బందికిసహకరించాలి.

ప్రశ్న: మందుల కొరత ఉందని ఏప్రిల్ నుంచి మందులు రావడం లేదు కదా. వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారా.

జవాబు: పశువుల్లో సీజనల్ వ్యాధులు రాకుండా ఆగస్టు మాసంలో గాలికుంటు వ్యాధులకు సంబంధించి టీకాలను ప్రొద్దుటూరు మండలంలో 14,475, దువ్వూరు మండలంలో 11,763 టీకాలు వేశాం. ఆవులు, ఎద్దుల్లో లంపీస్కిన్ డిసీజ్ రాకుండా జనవరి, జూలై మాసాల్లో ప్రొద్దుటూరు మండలంలో 1467, దువ్వూరు మండలంలో 1085 టీకాలు వేశాం. దీంతో వ్యాధులు ప్రబలకుండా ఉంటాయి.

ప్రశ్న: పశువ్యాధులపట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

జవాబు: సీజనల్ వ్యాధులపట్ల రైతుల్లో అవగాహన కల్పిస్తాం. నిరంతరం అందుబాటులో ఉంటున్నాం. ప్రొద్దుటూరులోని పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించి తగిన మందులు పొందాలని కోరుతున్నాం.

ప్రశ్న: మౌలిక వసతుల మాటేమిటి.

జవాబు: ప్రతిపాదనలు పంపగా మందులు నిలువ ఉంచే కూలింగ్ ఫ్రిజ్‌లు సమకూరాయి. ఇంకా బాటిల్ కూలర్స్, రెఫ్రిజిరేటర్ ఐఎల్ఆర్‌లు సమకూరాల్సి ఉంది. మిగిలిన వసతులు అందుబాటులో ఉన్నాయి.

అభివృద్ధివైపు పరుగులు : ఎమ్మెల్యే


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గం కూటమి హయాంలో అభివృద్ధి పనులతో పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, సర్పంచుల సంఘ అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, వీఎస్ ముక్తియార్‌ల ఆధ్వర్యంలో మైదుకూరు రోడ్డులోని స్థానిక డీసీఎస్ఆర్ లాడ్జీ నుంచి రిలయన్స్ పెట్రోలు బంకు వరకు రూ.1.25 కోట్ల వ్యయంతో కాలువ, వంద అడుగుల రహదారి, డివైడర్ల అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లె పంచాయతీ 13వ వార్డు మెంబర్ కొనిరెడ్డి హర్షవర్దన్‌రెడ్డి, తహసీల్దారు గంగయ్య, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు బద్వేలు శ్రీనివాసులరెడ్డి, పికాక్‌బార్ సుబ్బారెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పవన్‌కల్యాణ్‌ను విమర్శించడం తగదు'

బద్వేలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను ఎమ్మార్పీఎస్ నేత మంద క్రిష్ణ మాదిగ విమర్శించడం తగదని ఏపీ దళిత చైతన్యఫోరం రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ బాలికల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలపట్ల పవన్ కళ్యాణ్ ఆవేదన చెంది నేరానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు తప్ప అందులో కుల ప్రస్తావన లేదని, క్రిమినల్స్‌కు కులాన్ని అంటగట్టకూడదని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారన్నారు. సందర్భంగా లేకుండా పవన్‌కళ్యాణ్‌ను విమర్శించడం సరైనది కాదన్నారు.

ప్రతి రైతుకూ న్యాయం జరిగేట్లు చూస్తాం

బి.కోడూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో భూ రీసర్వేలో నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం జరిగేలా చూస్తామని తహసీల్దారు మధునాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పాయలకుంట్ల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిం చారు. ఈ రెవెన్యూ సదస్సులో కామకుంట, వేమకుంట, ఎ.కొత్తపల్లె రెవెన్యూ గ్రామ పొలంలోని రైతులందరూ అర్జీలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సర్వేలో రైతులం దరికీ నష్టం జరిగిందని కామకుంట, వేమకుంట, తిప్పరాజుపల్లె రెవెన్యూ గ్రామ పొలంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని వీరందరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వే యరు రక్షిత, సచివాలయ సర్వేయరు గురయ్య, ప్రసాద్, రాంప్రసాద్ మాజీ సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అక్రమ కుళాయిలు రెగ్యులర్ చేసుకోవాలి

జమ్మలమడుగు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధి ప్రజలు అక్రమ కుళాయిలకు ఫీజులు చెల్లించి రెగ్యులర్ చేసుకోవాలని కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ పట్టణంలో కుళాయి కనెక్షన్లు సర్వే ప్రకారం 10,827 ఉన్నాయన్నారు. వీటిలో 7,511 కుళాయి కనెక్షన్లు అధికారికంగా ఉన్నాయని, మిగిలిన కనెక్షన్లు అక్రమంగా ఉన్నాయన్నారు. వీటిని వారం రోజుల్లో ఫీజులు చెల్లించి రెగ్యులర్ చేసుకోవాలని కమిషనర్ తెలియజేశారు.

400 కేవీ లైన్ నిర్మాణానికి నేడు శంకుస్థాపన

మైలవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తలమంచిపట్నం 400 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఆర్టీపీపీ(ఏపీ జెన్‌కో)వరకు 400 కేవీ (టీఎండీసీ)లైన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా గురువారం ఉదయం 11 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు ఏపీ ట్రాన్స్‌కో ఈఈ శ్రీరామ చంద్రమూర్తి బుధవారం తెలిపారు. ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.193.30 కోట్ల వ్యయంతో తలమంచిపట్నం నుంచి ఆర్టీపీపీ వరకు ఇరువైపులా బే నిర్మాణంతో లైన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జేసీ అదితిసింగ్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఏపీ ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు హాజరుకానున్నారు.

భూమిపూజ

బ్రహ్మంగారిమఠం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేకలకుంట్ల పంచాయతీలో ఉపాధి హామీ పథకం నిధులతో పంచాయతీలోని రైతులకు మూడు పశువుల షెడ్డు నిర్మాణానికి రూ.2.30లక్షలు నిధులు మంజూరైనట్లు మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం పశువుల షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాలేపాటి సుబ్బారావు, సాంబశివారెడ్డి, మేకల సుధాకర్, వెంకటేశ్ నాయుడు, శివ, నాయుడు, భూతప్ప నాయుడు, పెరుగు వీరయ్య, ఓబులపతి నాయుడు, ఓబయ్య, ఏపీవో హరిక్రిష్ణ, జగన్‌మోహన్‌రెడ్డి,నాయకులు పాల్గొన్నారు.

మూగజీవాలకు సేవ చేయడం అదృష్టం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని శ్రీ వేంకటేశ్వర పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగుపడుతున్న విద్యార్థుల ఆరోగ్యం

కొండాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న వర్షిణి, పల్లవి అనే విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడుతున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న పల్లవి అనే విద్యార్థి దాదాపు కోలుకుని మాట్లాడుతోందని ప్రిన్సిపల్ తెలిపారు. కాగా ప్రొద్దుటూరు లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వర్షిణి కి బుధవారం వైద్యులు వెంటిలేటర్ తొలగించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రవహించే గాలేరు-నగిరి, హంద్రీనీవా, తెలుగుగంగ, వెలిగొండ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి త్వరలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం శ్రీశక్తిభవన్‌లో సీపీఎం పట్టణ మూడో మహాసభలు ముంతాజ్‌బేగం, పక్కీరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై గత పదేళ్లుగా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కడప, బెంగళూరు రైల్వే లైన్ 20 కిలోమీటర్లు మాత్రమే పూర్తయిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం నిధులు కేటాయించి రైల్వేలైన్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాంఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు మనోహర్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు నీరు నింపేందుకు పరిశీలన

ముద్దనూరు నవంబరు6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చెరువులకు గండికోట ప్రాజెక్టు, గాలేరు నగిరి కాల్వ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు నింపేందుకు బుధవారం ఇరిగేషన్ ఈఈ వెంకటరామయ్య పరిశీలించారు.సాగు,తాగునీరుకు ఇబ్బందిలేకుండా ఉండేందుకు కాల్వల ద్వారా చిన్నదుద్యాల, యామవరం, చింతకుంట, మంగపట్నం, గంగాదేవిపల్లె చెరువులకు గండికోట జలాలు నింపేందుకు సన్నాహాలు చేస్తున్నారు.అందులో భాగంగా చెరువులను ఈఈ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మంసాగర్ నుంచి ఎల్ఎస్‌పీకి నీటి పెంపు


ఇరిగేషన్ ఎస్ఈతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌కుమార్‌రెడ్డి

బి.కోడూరు, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంసాగర్ నుంచి పోరుమామిళ్ల చెరువు, అలాగే లోయర్ సగిలేరు ప్రాజెక్టు ద్వారా బద్వేలు పెద్దచెరువుకు నీరు పెంచాలని బుధవారం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నాయకుడు రితీష్‌కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరామయ్య, సీఈ శ్రీనివాసులు తదితరులు కలెక్టర్‌తో మాట్లాడారు. దీంతో కలెక్టరు చెరుకూరి శ్రీధర్ గతంలో బ్రహ్మంసాగర్ నుంచి ఎల్ఎస్‌పీ డ్యాం, పోరుమామిళ్ల చెరువుకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అయితే లోయర్ సగిలేరు ప్రాజెక్టు నుంచి బి.కోడూరుమండలంలోని అన్ని చెరువులు నింపుతూ బద్వేలు పెద్దచెరువుకు నీరు వెళ్లాలంటే రైతులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని కలెక్టరుకు విషయాన్ని తెలిపారు. దీంతో ఆయన 300 క్యూసెక్కుల నీరు అధనంగా పెంచాలని అధి కారులకు తెలిపారు. వీరి వెంట మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, గోడి రమణారెడ్డి ఉన్నారు.

పంటల సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలి



దువ్వూరు.. జిల్లేళ్లలో పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న అధికారులు

జమ్మలమడుగు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతూ పంటలపై అవగాహన కలిగి ఉండాలని జమ్మలమడుగు వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. బుధవారం జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో రైతు సేవా కేంద్రంలో రైతులకు సమావేశపరచి పంటల సాగుపై మినుము, జొన్నపై అవగాహన కల్పించారు. అలాగే మోరగుడి గ్రామంలో కందిపంటలో రైతులతో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకుడు జగదీష్, ఎస్.ఉప్పలపాడు, మోరగుడి రైతులు పాల్గొన్నారు.

ముద్దనూరు..: శనగ పంటలో వేరుకుళ్ళు తెగులు ఆశించిందని సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో వెంకటకృష్ణారెడ్డి రైతులకు సూచించారు. ఓబులాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఉద్యాన సహాయకురాలు రాధ, రైతులు పాల్గొన్నారు.

కలసపాడు..: మండలంలోని ఎగువతంబళ్లపల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించినట్లు ఏవో జాకీర్‌షరీఫ్ తెలిపారు.కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులుముని కుమారి, ఐసీఆర్‌పీ లక్ష్మి పాల్గొన్నారు.

దువ్వూరు..: జొన్న మొక్కజొన్న పంటల్లో కత్తెర పురుగు ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జిల్లేళ్ల గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

వేలిముద్ర వేయించుకున్న ఐదురోజులకు పింఛన్..!

● విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ నిర్వాకం

ఖాజీపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలబ్ధిదారులకు ఒకటవ తేదీనే పింఛను అందించాలని పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నా.. కొంతమంది సిబ్బంది వలన ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. ఖాజీపేట మండల పరిధిలోని పుల్లూరు పంచాయతీలో పనిచేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ 1వ తేదీన పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా.. అందులో కొంతమందికి మాత్రమే ఇచ్చారు. మరికొందరితో వేలిముద్రలు వేయించుకుని నెట్ పనిచేయలేదని చెప్పారు. మరోసారి వేలిముద్ర వేసి డబ్బు తీసుకోండి అని చెప్పి సుమారు 10 మందికి పింఛన్ ఇవ్వకుండా వెళ్లిపోయారు. అప్పటి నుంచి వీరు పంచాయతీ కార్యాలయం వద్దకు తిరగడం మొదలుపెట్టారు. ఈ విషయం బయటకు పొక్కడంతో.. క్యాష్ లేదు మీరు ఫోన్‌పే నంబరు తెచ్చుకుంటే వేస్తా అని ఆయన నాలుగురోజుల తర్వాత చెప్పారు. దీంతో వీరు నానా తంటాలు పడి నంబర్లు తెచ్చుకోగా ఫోన్‌పేలో డబ్బులు పంపించారు. ఎంపీడీవో దివిజ సంపతిని వివరణ కోరగా మండల పరిధిలో 98 శాతం పింఛన్లు పంపిణీ చేశామన్నారు. అవకతవకలు జరిగినట్లు తమ దృష్టికి రాలేదని, వస్తే చర్యలు తప్పవని అన్నారు.